



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు] అమ్మబడును




కె. అబెద్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243
RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 184 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 27 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## మార్కాపురం జిల్లాలో
# ఘోర బస్సు ప్రమాదం
## 13 మంది సజీవ దహనం!

**రాష్ట్రాన్ని కలచివేసిన ఘటన - బస్సు-టిప్పర్ ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు - గాయపడిన వారి పరిస్థితి విషమం**

మార్కాపురం, నేటివార్త : ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో ఈరోజు తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ప్రైవేట్ బస్సు, టిప్పర్ లారీ ఢీకొన్న ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి అం దోళనకరంగా మారింది. హైదరాబాద్ నుంచి పామూరుకు సుమారు 40 మంది ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేట్ బస్సు మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలోని క్వారీల వద్దకు రాగానే ఎదు రుగా వస్తున్న టిప్పర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో బస్సు పూర్తిగా దెబ్బతింది. ప్రమాదం తర్వాత బస్సు డీజిల్ ట్యాంక్ మిగతా .. 2లో..

---

### అన్ని రాష్ట్రాల సీఎంలతో
## రేపు మోదీ సమావేశం



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్య లకు ఉపక్రమించింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రు లతో ప్రధాని మోదీ మార్చి 27న సమావేశం కానున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. ఆయా రాష్ట్రాల సన్నద్ధతపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, పార్లమెంటు ఉభయ సభల్లో ఇటీవల మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సం క్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకా శాలున్నాయన్నారు. ఇది పరీక్షా సమయమే నన్నారు. సంక్షోభం మిగతా .. 2లో..

---

### ప్రతి గ్రామంలో
## టీడీపీ జెండా ఎగరాలి
### మంత్రి నారా లోకేశ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 29న పార్టీ ఆవిర్భావ దినోత్స వం అన్నిచోట్లా పం డుగలా చేయాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో తెలుగుదేశం జెండా ఎగరాలన్నారు. క్యాబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో నారా లోకేశ్ విడిగా భేటీ అయ్యారు. సీనియర్ నేతలను సన్మానించి వారితో మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి భోజనం చేయాలన్నారు. అర్హులందరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుందామన్నారు.

---


### 'వందేభారత్'
## భోజనంలో పురుగులు..
### ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా



**విశ్వం వాయిస్ న్యూస్ :** వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అందించిన ఆహారంలో పురు గులు కన్పించడం తీవ్ర వివాదాస్పదమైంది. తమకు ఇచ్చిన భోజనంలో పురుగులు ఉన్నా యంటూ రితేష్‌కుమార్ అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైల్వేశాఖ.. ఐఆర్‌సీటీసీకి జరిమానా విధిం చింది. వివరాల్లోకి మిగతా .. 2లో..

---

### పశ్చిమాసియా ఘర్షణల వేళ..
## రష్యా నుంచి ఇరాన్‌కు డ్రోన్లు..



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తోన్న ఇరాన్‌కు రష్యా నుంచి సహా యం అందుతున్న ట్లు తెలుస్తోంది. ఆ దేశానికి పుతిన్ ప్రభుత్వం దశలవారీగా డ్రోన్లను డెలివరీ చేస్తోందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొ న్నాయి. ఈ నెలాఖరుకు ఆ రవాణా పూర్తికా నుందని వెల్లడించాయి. డ్రోన్లతో పాటు ఆహారం, ఔషధాలను కూడా పంపిస్తోందని రాసుకొచ్చాయి. " ఇరాన్ అభివృద్ధి చేసిన డ్రోన్లను రష్యా తయారుచేస్తోంది. వాటిని ఉక్రెయిన్ యుద్ధంలో ఉపయోగిస్తోంది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను

---

### అమరావతికి చట్టబద్ధత కల్పించేలా
## ఏపీ క్యాబినెట్ తీర్మానం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ క్యాబినెట్ భేటీ ముగిసింది. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది.

**క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు**

రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం

వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చ

ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, మిగతా .. 2లో..

---

## ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

**దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమానహక్కు**
**ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన**
**3వ రోజ కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి**



**కుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** పరి శ్రమల రాకతో కుప్పానికి మహర్దశ పట్టబో తోందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 3వ రోజు భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శాంతిపురం మండలం మిగతా .. 2లో..

---

### ఆరోగ్యం, ఆదాయం, అభివృద్ధి - వెస్టీజ్ ద్వారా
## మహిళలకు కొత్త అవకాశాలు



**కలికిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం అన్నమయ్య జిల్లా, కలికిరి ధరణి హోటల్ ఆవరణలో వెస్టీజ్ సంస్థ యొక్క లక్ష్యాలు, వ్యాపార విధానం, వ్యక్తిగత అభివృద్ధికి అందించే అవకాశాల గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. పై కార్యక్రమం విస్టీజ్ క్రియాశీలక మిగతా .. 2లో..

---

## ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉండమన్నారు..

**అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రగల్భాలు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** యుద్ధం ముగిం పునకు సంబంధించి అమెరికాతో ఎలాంటి చర్చలు జరగట్లేదని ఓవైపు ఇరాన్ చెబుతుం డగా.. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు కొనసాగుతున్నట్లు పదే పదే చెబు తున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై మరోసారి స్పందించిన ట్రంప్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను ఇరాన్ సుప్రీంలీడర్‌గా ఎన్నుకొంటా మని అన్నారంటూ ప్రగల్భాలు పలికారు. రిపబ్లికన్ పార్టీ విరాళాల సేకరణ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. "ఇరాన్‌పై సైనిక విధ్వంసానికి పాల్పడ్డాం. ఈ యుద్ధంలో మేం భారీ మిగతా .. 2లో..

---

## పారిశ్రామికవేత్తలుగా వడ్డెర్లు

**వడ్డెర సామాజిక వర్గీయులకు ఆర్థిక, సామాజిక భరోసే మా లక్ష్యం**
**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వడ్డెర్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వారిని ఆర్థి కంగా మేలు చేయడమే సీఎం చంద్రబాబు సంకల్పమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయింపుల్లో 15 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. సీనరేజీలో 50 శాతం మినహా యింపు ఇవ్వడానికి కూడా కూటమి ప్రభుత్వం మిగతా .. 2లో..

---

### రాష్ట్రంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్
# కొరత లేదు

**నెల రోజుల్లో లక్ష పీఎన్జీ కనెక్షన్లు లక్ష్యం - 24 గంటల్లో పీఎన్జీ కనెక్షన్‌లకు అనుమతులు ఇస్తాం**
**సోషల్ మీడియాలో మాత్రమే గ్యాస్, పెట్రోల్ కొరత అంటూ అబద్ధాలు ప్రచారం**
**ప్రజలు పుకార్లను నమ్మవద్దు.. ఆందోళన చెందవద్దు.. రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయి**
**రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యాప్తంగా నెల రోజుల్లో లక్షకు పైగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు అందిం చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్ర మంత్రి మండలి ఆమో దించిన ముఖ్య నిర్ణయమైన పీఎన్జీ కనెక్షన్లు పెంపుపై ఏపీ సచివా లయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మిగతా .. 2లో..

---

### రైతన్నల సంక్షేమమే లక్ష్యం..
## మరింత అంకితభావంతో పనిచేస్తా..

- ప్రజాభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘ సేవ... అచ్చెన్నపై సీఎం ప్రశంసల వర్షం
- సచివాలయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో మంత్రి అచ్చెన్న పుట్టినరోజు వేడుకలు
- సీఎం చంద్రబాబు ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను పెంచాయన్న మంత్రి అచ్చెన్న



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో సీఎం ఛాంబర్‌లో మంత్రుల సమక్షంలో ఘనం గా వేడుకలు నిర్వహించారు. ఈ సం దర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభా కాంక్షలు తెలిపారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# మార్కాపురం జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

పగిలిపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగమారాయి. వేగంగా వ్యాపించిన మంటలు క్షణాల్లోనే బస్సు, టిప్పర్‌ను చుట్టుముట్టాయి. మంటల తీవ్రత ఎక్కు వగా ఉండటంతో ప్రయాణికులు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులుగాఢ నిద్రలో ఉండటంతో ప్రమాదాన్ని ముందుగానే గుర్తించలేకపోయారు. కొందరు అప్రమత్తమై బస్సు అద్దాలు పగలగొట్టుకుని బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే 10 మంది మాత్రం మంటల్లో చిక్కుకుని బయటపడలేక సజీవ దహనమయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని తక్షణమే మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ వైద్యులు తీవ్రంగా గాయపడిన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వారి గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం**

మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై ఏపీ క్యాబినెట్‌లో చర్చ జరిగింది. మృతులకు మంత్రివర్గం సంతాపం తెలిపింది. బాధిత కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. బాధితులకు అందుతున్న వైద్యాన్ని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సూచించారు.

**బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

ఏపీలోని మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సు ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని మోదీ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

**అన్ని రాష్ట్రాల సీఎంలతో**

# రేపు మోదీ సమావేశం

నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీం ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**'వందేభారత్'**

# భోజనంలో పురుగులు..

వెళితే.. రితేశ్‌కుమార్ మార్చి 15న పట్నా-టాటానగర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. ఆ సమయంలో తమకు అందించిన భోజనంలోని పెరుగులో పురుగులు రావడంతో ఆయన కంగుతిన్నారు. వెంటనే మేనేజర్‌ని పిలిచి ఫిర్యాదు చేశారు. రైలు సిబ్బంది ఆ భోజనాన్ని పరిశీలించారు. ఇదంతా రితేశ్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇదికాస్తా వివాదాస్పదం కావడంతో రైల్వే మంత్రిత్వశాఖ ఎక్స్‌లో స్పందించింది. ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది. ఆ రైల్లో కేటరింగ్ చేసిన ఫుడ్ సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానాతో పాటు అతడి కాంట్రాక్టును రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికుల భద్రత, రైల్వే సౌకర్యాల్లో నాణ్యతే తమ ప్రథమ ప్రాధాన్యమని రైల్వేశాఖ వివరించింది.

**పశ్చిమాసియా ఘర్షణల వేళ..**

# రష్యా నుంచి ఇరాన్‌కు డ్రోన్లు..

బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ షిప్‌మెంట్లు చేస్తోంది" అని పశ్చిమదేశాల నిఘా సమాచారాన్ని ఉటంకించాయి. అమెరికా యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, సైనిక స్థావరాల గురించి ఇరాన్‌కు రష్యా 'రియల్ టైమ్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ సమాచారాన్ని ఇరాన్‌కు రష్యా చేరవేస్తోందని వాటి సారాంశం. ఇక తాజా కథనాలపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి స్పందించారు. "ప్రస్తుతం చాలా నకిలీ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడ ఒకటి మాత్రం వాస్తవం. ఇరాన్ నాయకత్వంతో మా సంప్రదింపులు కొనసాగిస్తున్నాం" అని స్పష్టం చేశారు.

**ఇరాన్‌లోని రష్యా ఉద్యోగులు వెనక్కి..**

ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నుంచి తన ఉద్యోగులను రష్యా వెనక్కి రప్పించింది. మంగళవారం ఈ ప్లాంట్‌పై క్షిపణి పడిన నేపథ్యంలో 163 మంది సిబ్బందిని అక్కడినుంచి తరలించింది. ఈ ప్లాంట్‌ను నిర్మించింది రష్యానే. మిగతా యూనిట్ల నిర్మాణం కోసం అక్కడ కొందరు సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి అక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది.

**అమరావతికి చట్టబద్ధత కల్పించేలా**

# ఏపీ క్యాబినెట్ తీర్మానం

సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ
కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం
2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ
జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు
వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది.

కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. ఎల్లుండి అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు. " ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితుల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

శివ పురంలోని నివాసంలో స్థానిక నేతలతో నారా భువనేశ్వరి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శాంతిపురంలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబసభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. రామకుప్పం,మణేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. రామకుప్పంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకుప్పం మండలం బల్ల గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. అనంతరం రామకుప్పంలో టీడీపీ కార్యకర్త ముజాహిద్ ఇంటికి వెళ్లి కుటుంసభ్యులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి వెళ్లిన నారా భువనేశ్వరి ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు**

కుప్పం నియోజకవర్గం రామకుప్పంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో కిలోమీటరు మేర వారితో పాటే భువనేశ్వరి కలిసి నడిచారు. విగ్రహావిష్కరణ అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రూ. 2 కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్. మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారు. రిజర్వేషన్లు కల్పించారు. ప్రత్యేకంగా మహిళల కోసం పద్మావతి మహిళా యూనివర్సిటీ స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. డ్వాక్రా స్థాపించి మహిళల ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రవేశపెట్టారని నారా భువనేశ్వరి అన్నారు. అనంతరం రామకుప్పంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి భువనేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు.

**కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక**

రామకుప్పం మండలం బల్ల గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు గారు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర, స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం చంద్రబాబు గారి సమర్థ నాయకత్వానికి నిదర్శనం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ , అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతున్నాయి. చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. కుప్పానికి పరిశ్రమల రాకతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం చేస్తున్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు సంజీవని ప్రాజెక్టు తెచ్చారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చారు. డ్వాక్రా స్థాపించి మహిళలకు ఆర్థిక భద్రత కల్పించారు. కుప్పంలో ఎలీప్ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. చంద్రబాబు గారికి ప్రజలే ముఖ్యమని, సాయం కోసం వచ్చిన వారు ఏ పార్టీ అని ఆలోచించరని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటారని నారా భువనేశ్వరి తెలిపారు.

**ఆరోగ్యం, ఆదాయం, అభివృద్ధి - వెస్టీజ్ ద్వారా**

# మహిళలకు కొత్త అవకాశాలు

సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యంగా, స్వయం ఉపాధి అవకాశాలు, ఆరోగ్య మరియు వెల్‌నెస్ ఉత్పత్తుల ప్రాముఖ్యత, అలాగే నెట్‌వర్క్ మార్కెటింగ్ ద్వారా ఆదాయం పొందే మార్గాలపై వారు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మొత్తం 30 మంది మహిళలు హాజరయ్యారు. సభ్యుల ప్రసంగాలు మరియు విజయ గాథలు వారిలో మంచి స్పందనను కలిగించాయి. సమావేశం ముగిసే సరికి, హాజరైన మహిళలు వెంటనే స్పందించి వెస్టీజ్ సంస్థలో సభ్యత్వం కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్వాహకులు మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, మహిళలకు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశం ద్వారా స్థానిక మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా, కొత్త వ్యాపార అవకాశాలపై ఆసక్తి కూడా పెరిగినట్లు కనిపించింది.

# ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉండమన్నారు..

విజయాన్ని సాధించబోతున్నాం. ఇంతవరకూ పశ్చిమాసియాలో ఎవరూచూడని విక్టరీ అది. ఇక, యుద్ధం ముగింపు విషయంలో మేం చర్చలు జరుపుతున్నాం. ఆ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. కానీ, ఆ విషయాన్ని వారు బయటకు చెప్పట్లేదు. ఎందుకంటే సొంత ప్రజల చేతుల్లోనే హత్యకు గురవుతారని వారు భయపడుతున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేగాక, ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఉండాలని ఆ దేశ నేతలు తనను అడిగినట్లు ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే, అలాంటి పదవిని తాను కోరుకోవట్లేదని, అందుకే వారి అభ్యర్థనను తిరస్కరించానంటూ ప్రగల్భాలు పలికారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ప్రారంభించిన తొలిరోజే సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీని సుప్రీంలీడర్‌గా ఎన్నుకొన్నారు. అయితే, ఇప్పటివరకు ఆయన బహిరంగంగా కన్పించలేదు. మరోవైపు, అమెరికా దాడుల్లో మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

# పారిశ్రామికవేత్తలుగా వడ్డెర్లు

నిర్ణయించిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రిమండలి బిల్లు కూడా ఆమోదించిందని తెలిపారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చడంపై హర్షం వ్యక్తంచేశారు. మాటల నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహించారని, ఆ సమయంలో వడ్డెర సామాజిక వర్గీయులు ఆయన్ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారన్నారు. రాళ్లు కొట్టడం, మట్టి పనులు చేసుకోవడం తమ జీవనోపాధిని, ప్రభుత్వ ఆధీనంలోని కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ లీజులు కల్పిస్తే తాము గౌరవప్రదంగా జీవనం సాగిస్తామని మంత్రి లోకేశ్ కు అప్పట్లో వినతిపత్రం అందజేశారు. వడ్డెర సామాజిక వర్గీయులు వినతికి సానుకూలంగా స్పందించిన లోకేశ్, తాము అధికారంలోకి రాగానే తప్పకుండా న్యాయం చేస్తామని అప్పట్లో భరోసా ఇచ్చారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో భేటీ అయిన మంత్రిమండలి సమావేశంలో మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం మేర రిజర్వేషన్లు కేటాయిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. సీనరేజీలో కూడా 50 శాతం ఫీజు మినహాయించాలని ఆ బిల్లులో ఉందన్నారు. ఎన్నికల హామీని నెరవేర్చినందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. మైనింగ్ లీజుల్లో కేటాయింపులు, సినరేజీ మినహాయింపులపై కూటమి ప్రభుత్వం త్వరలోనే జీవో జారీచేయనుందని వెల్లడించారు. త్వరలో ప్రారంభం కాబోయే ఆదరణ 3.0 పథకంలో వడ్డెర్లకు ప్రాధాన్యమివ్వనున్నామన్నారు. మైనింగ్ లో వినియోగించేలా వడ్డెర్లకు ఆధునిక మిషన్లు అందజేయాలని నిర్ణయించామన్నారు. వెనుకబడిన వడ్డెర్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. అందుకనుగుణంగా మైనింగ్ లీజుల కేటాయింపుల్లో వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

**రాష్ట్రంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్**

# కొరత లేదు

వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, నెల్లూరు,కాకినాడ,విశాఖపట్నం, తిరుపతి తదితర నగర ప్రాంతాల్లోని ఎల్పీజీ సిలిండర్లు వినియోగిస్తున్న వినియోగ దారులను ఆయా నగరాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జీ) వైపు మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.పిఎన్‌జీ ద్వారా గ్యాస్ నిరంతర సరఫరా అందుబాటులో ఉండడంతో పాటు అపార్ట్‌మెంట్లు, పారిశ్రామిక యూనిట్లు ఈ సదుపాయాన్ని వినియోగిస్తే కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభిస్తాయని వివరించారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి,విజయవాడ కనకదుర్గ దేవస్థానం,శ్రీ కాళహస్తి, అన్నవరం,సింహాచలం దేవాలయాల్లో కూడా పీఎన్జీ కనెక్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అంతేకాకుండా అన్న క్యాంటిన్లకు కూడా పీఎన్జీ కనెక్షన్లు అందించాలన్న నిర్ణయం తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఎన్జీ కనెక్షన్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు.అందులో భాగంగానే పీఎన్జీ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న అపార్ట్ మెంట్లు,హోటళ్లు తదితర కమర్షియల్ యూనిట్లు, పారిశ్రామిక యూనిట్లకు 24 గంటల్లో కనెక్షన్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.అవసరమైతే ఆటోమేటిక్ అనుమతి వ్యవస్థను అమలు చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జీఎస్టీ 5 శాతం నుండి 25 శాతంకు పెంచడం వల్లే పీఎన్జీ వినియోగంపై వినియోగదారులు ఆసక్తి చూపలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.దీపం సబ్సిడీ పథకాన్ని పీఎన్జీ వినియోగదారులకు కూడా వర్తింపజేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీపం పథకం కింద నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ అందిస్తుండగా, పిఎన్‌జీ వినియోగదారులకు నిబంధనల మేరకు రెండు నెలలకు ఒకసారి సబ్సిడీ ప్రయోజనం అందే విధంగా మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు సిలిండర్లకు సంబంధించిన రూ.2400 డిబిటి మొత్తాన్ని పీఎన్జీ వినియోగదారులకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 94 లక్షల దీపం పథకం లబ్ధిదారులు ఉన్నారన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న వదంతులను ఖండిస్తూ,రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 2 లక్షల 70 వేల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని చెప్పారు. అయితే గ్యాస్ కొరత అంటూ సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం కావడంతో వినియోగదారులు అవసరం లేకపోయినా గ్యాస్ సిలిండర్ లు బుక్ చేయడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు.కాని నేడు పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.సాధారణంగా రోజుకు 2.70 లక్షల నుండి 2.80 లక్షల సిలిండర్లు డెలివరీ అవుతున్నాయని, ఒక్కో రోజు 3.30లక్షల సిలిండర్లు కూడా డెలివరీ చేశామని వివరించారు. గ్యాస్,ఆయిల్ బ్లాక్ మార్కెట్ కు పాల్పడినా,ధరలు పెంచి అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్ పాల్గొన్నారు.

**రైతన్నల సంక్షేమమే లక్ష్యం..**

# మరింత అంకితభావంతో పనిచేస్తా..

తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**రాష్ట్రంలో 27,500 గ్రామ సంఘ**

# సహాయకులకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

**పేదల ఇళ్లల్లో 20 ఏళ్ల క్రితమే చంద్రబాబు వెలుగులు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**అమరావతి,** గ్రామీణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తోన్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సంఘ సహాయకులకులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయాలన్న నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. రెండున్నర దశాబ్దాల క్రిందటే నాడు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వెలుగు పథకం ద్వారా పేదల ఇళ్లల్లో వెలుగులు నింపేందుకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారని మంత్రి చెప్పారు. డ్వాక్రా సంఘాల పటిష్టతకోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకంగా సెర్ప్ సంస్థ ఏర్పాటు చేశారని మంత్రి గుర్తు చేశారు. నాడు చంద్రబాబు మదిలో వచ్చిన ఈ పథకం ద్వారా గ్రామాల్లో 90 లక్షల మంది మహిళలు 8.32 లక్షల స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా స్వయంకృషితో ఎదుగుతున్నారని మంత్రి తెలిపారు. ఈ సభ్యుల నుంచి ప్రతి గ్రామంలోనూ ఒక సంఘ సహాయకురాలుగా ఉన్న వారు తమ సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, సీఐఎఫ్ లాంటి ఇతర ఆర్థిక పథకాల ద్వారా సభ్యులకు సాయం అందిస్తున్న నేపథ్యంలో వీరికి స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం అని మంత్రి తెలిపారు. ఈ సంఘ సహాయకులకు 2017లోనే తెలుగుదేశం ప్రభుత్వం గ్రామ సహాయకులకు తొలిసారి ట్యాబ్‌లు ఇవ్వగా... ఇప్పుడు కొత్తగా ఆండ్రాయిడ్ అప్లికేషన్లు రావడం, డేటా సేకరణ కోసం స్మార్ట్ ఫోన్లు కావాలని గ్రామ సంఘ సహాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు మంత్రి చెప్పారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర వ్యాప్తంగా 27,500 స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చారన్నారు. ఈ ఫోన్లు శ్యామ్‌సంగ్ ఏ06 మోడల్‌లో 6 జీబీ ర్యామ్ - 128 జీబీ స్టోరేజ్ - చార్జర్ - కేస్ - ప్రొడక్షన్ కవర్ - ఎండీఎం సాఫ్ట్‌వేర్ కలిగి ఉంటాయని... ఈ స్మార్ట్ ఫోన్లను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా పారదర్శక టెండర్లలో కొనుగోలు చేసినట్టు మంత్రి తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## మ్యాజిక్ ఫిగర్ త్రిబుల్ డిజిట్.. వైసీపీకి టఫ్ టాస్క్!

ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి క్రిష్ణా జిల్లా దాకా మొత్తం 101 సీట్లు ఉన్నాయి. సీట్లు కొత్తగా పెరిగితే ఇవి కాస్తా 150 ప్లస్ అవుతాయి. పెరుగుతున్న సీట్ల వల్ల అవకాశాలు ఎన్ని ఉంటాయో రాజకీయంగా సవాళ్ళు అంతకు మించి ఉంటాయి. ముఖ్యంగా ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు ఈ టఫ్ టాస్క్ గా ఉండబోతోంది. దేశమంతా ఒకే విధంగా ఉన్న సీట్లకు మరో యాభై సీట్లను కలుపుతూ కొత్తగా సీట్ల పెంపునకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బిల్లు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. ఈ లెక్కన ఏపీలో చూస్తే 175 ప్లస్ 88 కలుపుకుని 263గా అసెంబ్లీ సీట్లు ఉండబోతున్నాయి. మరి ఏపీలో అధికారం చేపట్టాలంటే గతంలో మాదిరిగా డబుల్ డిజిట్ 88 మ్యాజిక్ ఫిగర్ అయితే కానే కాదు, ఈసారి ఆ నంబర్ త్రిబుల్ డిజిట్ కి చేరుకుంది. అదే 132 అన్న మాట.

సింగిల్ గా ఫైట్ : ఇక ఏపీలో చూస్తే వైసీపీ విపక్షంలో ఉంది. ఏ పార్టీతోనూ జట్టు కట్టే సీన్ అయితే లేదు, వామపక్షాలతో వైసీపీ మైత్రి చేస్తుంది అని వార్తలే తప్ప ఆ దిశగా ఎలాంటి సంకేతాలు అయితే లేవు. పైగా సీపీఐ అయితే మొదటి నుంచి వైసీపీకి దూరంగానే ఉంటోంది. ఇక సీపీఎం అయితే కొంత సాఫ్ట్ కార్నర్ తో ఉన్నా వైసీపీ వైపు నుంచి పాజిటివ్ రియాక్షన్స్ రావడం లేదు, కాంగ్రెస్ తో అయితే వైసీపీకి శాశ్వత వైరమే. అది సిద్ధాంతబద్ధమైనది అనడం కంటే వ్యక్తిగతంగానే అని చెప్పాల్సి ఉంటుంది. జగన్ ని అక్రమంగా అరెస్ట్ చేయించి జైలులో వేసింది కాంగ్రెస్ అన్న ఆగ్రహం ఆ పార్టీలో ఉంది. దాంతో ఏపీలో విపక్షంలో ఒక కూటమి ఏర్పాటు కావడం అయితే బహు కష్టం. సో వైసీపీ ఆలోచనలు కూడా సింగిల్ గా పోటీకి దిగడమే అన్నది ఉంది.

గ్రౌండ్ లెవెల్ లో సీన్ : ఇక ఏపీలో చూస్తే మూడు రీజియన్లలో గ్రౌండ్ లెవెల్ లో సీన్ చూస్తే వైసీపీకి గ్రాఫ్ అయితే పెద్దగా పెరిగింది ఇప్పటికి అయితే లేదని అంటున్నారు. ముఖ్యంగా వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో కూడా బాగా పుంజుకోవాల్సి ఉంది అని అంటున్నారు. అక్కడ ఒక బలమైన సామాజిక వర్గం వైసీపీకి ఇంకా గ్యాప్ పాటిస్తోంది అని అంటున్నారు. ఆ వర్గం ఉదాశీనతతో పాటు ధర్మాగ్రహం వల్లనే 2024 ఎన్నికల్లో వైసీపీ భారీ ఓటమిని అందుకుంది అని విశ్లేషణలు ఉన్నాయి. అదే విధంగా రాయలసీమలో టీడీపీ గతం కంటే బలపడుతోంది, డెవలప్మెంట్ కాన్సెప్ట్ తో ఆ పార్టీ ముందుకు సాగుతోంది. అలాగే సామాజిక సమీకరణలను కూడా బేరీజు వేసుకుంటూ వైసీపీని దెబ్బ తీసేందుకు వ్యూహ రచన చేస్తోంది. బీజేపీ ఫోకస్ కూడా రాయలసీమ మీద ఉందని అంటున్నారు. జనసేన కూడా ఒక ప్రధాన సామాజిక వర్గం దన్నుతో ఎదగాలని చూస్తోంది. దీంతో వైసీపీకి 2014, 2019 నాటి ఫలితాలు అయితే మళ్ళీ వస్తాయా అన్న చర్చ ఉండనే ఉంది.

యధాతథ పరిస్థితి : ఇక కోస్తా ఉభయ గోదావరి రీజియన్ లో చూసుకుంటే వైసీపీకి యధాతథ పరిస్థితి ఉందని అంటున్నారు. దక్షిణ కోస్తాలో ప్రకాశం, నెల్లూరులలో వైసీపీ ఇపుడిపుడే కోలుకుంటోంది అన్న ఆశలు ఉన్నప్పటికీ క్రిష్ణా గుంటూరులలో టీడీపీ అత్యంత బలంగా ఉంది. ఉభయ గోదావరి జిల్లాలలో జనసేన ప్రభావం గణనీయంగా ఉంది. వీటిని తట్టుకుని వైసీపీ బలం పుంజుకోవాలంటే గడచిన 21 నెలలలో తగిన విధంగా కార్యాచరణ అయితే చేసింది పెద్దగా లేదని అంటున్నారు. దాంతో ప్రస్తుతానికి అయితే గ్రాఫ్ అయితే పెరగలేదని అంటున్నారు. అలాగే ఉత్తరాంధ్ర రీజియన్ లో కూడా కూటమి స్ట్రాంగ్గా ఉంది. ఇక్కడ సామాజిక రాజకీయ కోణంలో నుంచి చూస్తే కూటమిలోని మూడుపార్టీలకు అనుకూలంగానే ఈ రోజుకీ ఉంది అని అంటున్నారు. వ్యతిరేకత వస్తుందని వైసీపీ పెట్టుకున్న ఆశలు అయితే అంతగా ఫలించడం లేదని అంటున్నారు.

మ్యాజిక్ అంతా అక్కడే : ఇక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి క్రిష్ణా జిల్లా దాకా మొత్తం 101 సీట్లు ఉన్నాయి. సీట్లు కొత్తగా పెరిగితే ఇవి కాస్తా 150 ప్లస్ అవుతాయి. మరి ఇందులోనే మెజారిటీ సీట్లు ఏ పార్టీ కానీ కూటమి కానీ సాధిస్తుందో అదే అధికారం చేపడుతుందని అంటున్నారు. నెల్లూరు, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం ఉమ్మడి జిల్లాలలో 74 దాకా అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. సీట్లు ఇక్కడ కొత్తగా పెరిగితే 111 నంబర్ అవుంది. ఈ గ్రేటర్ రాయలసీమలో ఒకవేళ వైసీపీకి పరిస్థితులు అనుకూలించి మెజారిటీ సీట్లు సాధించినా మ్యాజిక్ ఫిగర్ అయిన 132 నెంబర్ ని చేరుకోవడానికి కోస్తా జిల్లాల అవసరం భారీగానే ఉంటుంది. ఈ సీట్లన్నీ ఒంటి చేత్తో వైసీపీ గెలుచుకోవాల్సి ఉంటుంది. అవతల వైపు మూడు పార్టీలను ఎదిరించి నిలబడాల్సి ఉంటుంది. ఇది చాలా కష్టమైన రాజకీయ పోరాటంగా చెబుతున్నారు. ఇప్పటి నుంచే వైసీపీ అధినాయకత్వం జనంలో ఉండే నాయకత్వాన్ని గుర్తించి ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తూ కనెక్ట్ కాకపోతే మాత్రం ఇబ్బంది అవుతుందని అంటున్నారు. అదే కూటమికి అయితే 132 మ్యాజిక్ ఫిగర్ ని మూడు పార్టీల బలంతో చేరుకోవడం వైసీపీ కంటే సులభం అవుతుంది అన్నది రాజకీయ లెక్కలు చెబుతున్న విశ్లేషణగా ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఉగ్ర సంబంధాలున్న మరో ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్‌లో సైదా బేగం, బళ్లారిలో అబ్దుల్ సలామ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు**
**వచ్చే నెల 6 వరకు రిమాండ్ విధించిన విజయవాడ కోర్టు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ వెళ్లిన ప్రత్యేక బృందం చంచల్‌గూడలో సైదా బేగం (ఏ5)ను, బళ్లారి వెళ్లిన బృందం అబ్దుల్ సలామ్ ఎలియాస్ అల్ హిందీ ఎలియాస్ పీస్ ఆఫ్ సోల్ ఎలియాస్ లాలా (ఏ11)ను అదుపులోకి తీసుకుని బుధవారం విజయవాడ తీసుకొచ్చాయి. నిందితులను విచారించిన అనంతరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం నగరంలోని సీఎంఎం కోర్టులో న్యాయాధికారి రాధారాణి ఎదుట హాజరుపర్చారు. నిందితులకు కోర్టు వచ్చే నెల 6 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

**ఇళ్లల్లో పనులు చేస్తూ ఒకరు.. లారీ నడుపుతూ మరొకరు**

విజయవాడలో ఉగ్ర కలకలంపై కేంద్ర నిఘా విభాగం ఐబీ (ఇంటెలిజెన్స్ బ్యూరో) రంగంలోకి దిగింది. నిందితులను కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో ఐబీ అధికారులు.. సైదా బేగం, సలామ్‌లతో మాట్లాడి వివరాలు రాబట్టారు. 'తీవ్రవాదం వైపు ఎలా ఆకర్షితులయ్యావు? ఎవరెవరితో సంబంధాలున్నాయి? ఉగ్రవాద భావజాలాన్ని ఎలా వ్యాపింపజేస్తున్నావు?' అని ప్రశ్నించి, వివరాలు రాబట్టారు. తనకు తీవ్రవాదులతో ఎటువంటి సంబంధాలు లేవనీ, నాలుగో తరగతి వరకు చదువుకున్నానని ఆమె చెప్పింది. భర్త నాలుగేళ్ల కిందట చనిపోవడంతో ఏడేళ్ల కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటూ.. ఇళ్లల్లో పనులు చేసుకుంటున్నానని తెలిపింది. తనను, తన కుమారుడిని చూసుకునేందుకు సామాజిక మాధ్యమాల్లో అన్వేషిస్తుండగా నలుగురు యువకులు ఆన్‌లైన్‌లో పరిచయమయ్యారని తెలిపింది. వారు ఫార్వార్డ్ చేసిన పోస్టులను తాను పోస్టు చేసేదాన్నని, తన ఐడీలను వారు ఉపయోగించుకునేవారని కేంద్ర నిఘా అధికారులకు చెప్పింది. బళ్లారికి చెందిన అబ్దుల్ సలామ్‌కు సొంత లారీ ఉంది. దానిని నడుపుతూ ఉగ్రవాద గ్రూపుల్లో చేరి, వారి భావజాలానికి ఆకర్షితుడయ్యాడు. అరెస్టయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న రహంతుల్లా షరీఫ్, మహ్మద్ దానిష్, మీర్జా సొహైల్ బేగ్‌ల తరఫున న్యాయవాదిగా పిచుక శ్రీనివాస్ కోర్టులో బుధవారం వకాలత్ ఫైల్ చేశారు. కోర్టు సూచనతో వీరు న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే.

## కల్తీ కొబ్బరి పొడి గుట్టురట్టు



**గోషామహల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొందరు అక్రమార్కులు కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా హైదరాబాద్ బేగంబజార్‌లోని ఓ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, కల్తీ కొబ్బరిపొడి గుట్టురట్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌లో 'బాలాజీ పురుషోత్తం కోకోనట్ బిజినెస్ షాప్' పేరుతో కొబ్బరి పొడిని తయారు చేస్తున్న కేంద్రంపై గోల్కొండ, ఖైరతాబాద్ జోన్ల టాస్క్‌ఫోర్స్ బృందాలు, గోషామహల్ పీఎస్ అధికారులు కలిసి దాడి చేశారు. యజమాని నకుల్ మరోటియా(31)ను అరెస్టు చేశారు. ఇతను కర్ణాటక నుంచి నాణ్యత లేని కొబ్బరిపొడిని తక్కువ ధరకు కొనుగోలు చేసి దానికి రసాయనాలు కలిపి, నాణ్యమైన కొబ్బరి పొడిలాగ తయారుచేసి 'చేతక్ బ్రాండ్' అనే పేరు ఉన్న ప్యాకెట్లలో నింపుతున్నాడు. ప్యాకెట్లపై బ్యాచ్ నంబరు, ఎక్స్‌పైరీ డేట్, ఆహార భద్రతా ప్రమాణాల లైసెన్సు వివరాలేవీ లేవని అధికారులు తెలిపారు. నిందితుడు బేగంబజార్ కేంద్రంగా సబ్‌ఏజెంట్లను నియమించుకొని రాష్ట్రవ్యాప్తంగా కల్తీ కొబ్బరి పొడి ప్యాకెట్లను విక్రయిస్తున్నాడన్నారు. ఘటనాస్థలం నుంచి రూ.21 లక్షల విలువ చేసే 8,300 కిలోల కొబ్బరి పొడి, ప్యాకింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## గిరిజన బాలికపై హత్యాచారం

**పాఠాలు చెబుతానంటూ తల్లిదండ్రుల్ని నమ్మించి ఘాతుకానికి పాల్పడిన సివిల్ ఇంజినీర్ – శ్రీకాకుళం జిల్లాలో దారుణం**

**బలగ(శ్రీకాకుళం), విశ్వం వాయిస్ న్యూస్ :** ఉజ్వల భవిష్యత్తు కోసం కలలు కంటున్న అమాయక గిరిజన బాలికపై ఓ సివిల్ ఇంజినీర్ హత్యాచారానికి పాల్పడిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. పాఠాలు చెబుతానంటూ బాలికను నమ్మకంగా పిలిపించిన నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లిదండ్రుల కథనం ప్రకారం... హిరమండలంలో ఓ గ్రామానికి చెందిన దంపతుల ఏకైక కుమార్తె(17) విజయనగరం జిల్లా శృంగవరపుకోటలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. స్థానికంగా సివిల్ ఇంజినీరుగా పని చేస్తున్న వెంకటరమణ.. 'అమ్మాయికి పాఠాలు చెబుతాను.. నా వద్దకు పంపండి' అని తల్లిదండ్రులను ఒప్పించాడు. కుమార్తె భవిష్యత్తు బాగుండాలని ఆశించిన వారు నమ్మకంతో అందుకు అంగీకరించారు. ఈ నెల 22న బాలికను శ్రీకాకుళం తీసుకురావాలని వెంకటరమణ సూచించడంతో తండ్రి స్వయంగా తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక తాను శ్రీకూర్మంలో ఉన్నానని... ఇక్కడికి రావాలని వెంకటరమణ ఫోన్‌లో చెప్పాడు. దీంతో ఇద్దరూ కలిసి శ్రీకూర్మం వెళ్లారు. బాలికను అక్కడే ఉంచిన వెంకటరమణ... తండ్రిని వెనక్కి పంపేశాడు.

**అత్యాచారం చేసి... దాడి చేసి...**

23న బాలికను విశాఖలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి పైశాచికంగా దాడి చేశాడు. 'మీ కుమార్తె అనారోగ్యానికి గురైంది' అంటూ 24న తల్లిదండ్రులకు సమాచారమిచ్చాడు. వారికి బాలికను అప్పగించడంతో స్వస్థలానికి తీసుకెళ్లారు. అప్పటికీ ఆమె కొనఊపిరితో ఉన్నప్పటికీ... 'మీ కుమార్తె చనిపోయింది. అందుకు నేనే కారణం. ఈ విషయం బయటకు చెప్పకుండా దహన సంస్కారాలు నిర్వహించండి. మీకు డబ్బు ఇస్తాను' అని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చాడు. కొనఊపిరితో ఉన్న కుమార్తెను వారు శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి బుధవారం తీసుకొచ్చారు. 'చదువు చెబుతానంటే నమ్మి పంపించాం. మా బిడ్డను చంపేశాడు. నిందితుడిని కఠినంగా శిక్షించండి. న్యాయం చేయండి' అని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారి ఫిర్యాదు ఆధారంగా హిరమండలం ఎస్సై వి.హేమంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బాలుడి అపహరణ విషాదాంతం.. బావే కడతేర్చాడు



**యాడికి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా యాడికి మండలం కోన ఉప్పలపాడులో బాలుడి అపహరణ విషాదాంతమైంది. ఏడేళ్ల వేంచంద్రకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి అతడి బావ బోయ సర్వేశ్ హత్య చేసినట్లు పోలీసులు నిర్ధరించారు. బాలుడ్ని చంపేసి.. కుందనకోటకొండలో పడేసినట్లు గుర్తించారు. వేంచంద్ర అక్కను బోయ సర్వేశ్ వివాహం చేసుకున్నాడు. ఉగాదికి భార్యతో కలిసి అత్తారింటికి వచ్చిన సర్వేశ్.. తనకు గౌరవం ఇవ్వడం లేదని అత్త, మామలపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే వేంచంద్ర పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా తినుబండారాలు ఇప్పిస్తానని చెప్పి తీసుకెళ్లి హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న వేంచంద్ర రోజులాగే బుధవారం కూడా పాఠశాలకు వెళ్లాడు. ఒంటిపూట బడి కావడంతో మధ్యాహ్నం సమయంలో బస్సు డ్రైవరు పిల్లలను ఎక్కించుకుని వేంచంద్రతో పాటు మరికొంతమంది పిల్లలను దింపి, వెనుతిరిగి వెళ్లాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న అతడి బావ తినుబండారాలను ఇచ్చి తీసుకెళ్లాడు. ముఖానికి ముసుగు ధరించిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై రావడం, కోనఉప్పలపాడులోని చిల్లర దుకాణం వద్ద తినుబండారాలు కొనుగోలు చేయడం.. అదే సమయంలో పాఠశాల బస్సు రావడం.. అక్కడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడింది.

**పాల కోసం ఏడుస్తోందని**

## గొంతు నులిమి చంపేసిన తల్లి

**వరదయ్యపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాల కోసం ఏడుస్తోందని కన్న కూతుర్నే గొంతు నులిమి చంపేసింది ఓ కసాయి తల్లి. ఈ విషాద ఘటన తిరుపతి జిల్లా సత్యవేడు మండల పరిధిలోని నరసరాజు అగ్రహారంలో గురువారం జరిగింది. సీఐ మురళి వెల్లడించిన వివరాల మేరకు తమిళనాడులోని వెంగలచేరికి చెందిన హైమవతి, వెంకటేశ్ దంపతులు సత్యవేడు పరిసరాల్లో సిమెంట్ ఇటుకల తయారీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు రుత్విక్, ఆరు నెలల చిన్నారి సంతానం. గురువారం చిన్నారి పాల కోసం ఏడుస్తుండటంతో క్షణికావేశానికి గురైన తల్లి పసిపాప గొంతు నులిమేసింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మురళి, ఎస్సై సాయినాథ్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

**పెళ్లయిన మహిళతో ప్రేమ..**

## ఆపై ఇద్దరూ ఆత్మహత్య

**ఉంగుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వారిద్దరూ సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యారు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. తర్వాత పెళ్లి చేసుకున్నారు. కానీ, అనూహ్యంగా ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఏలూరు జిల్లా ఉంగుటూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉంగుటూరు మండలం యర్రమళ్లకు చెందిన చిన మావుళ్లయ్య (25) చేపల ప్యాకింగ్ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం శ్రీకాకుళానికి చెందిన ఇర్రి రమ (35) సామాజిక మాధ్యమాల ద్వారా అతడికి పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. అప్పటికే ఆ మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల రమను మావుళ్లయ్య వివాహం చేసుకున్నాడు. ఈ విషయం ఆమె తల్లిదండ్రులు, భర్తకు తెలియడంతో యర్రమళ్ల వచ్చి తీసుకెళ్లిపోయారు. అయితే, కుటుంబాన్ని వదిలేసి రమ మళ్లీ ఉంగుటూరు వచ్చేసింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మావుళ్లయ్య నాచుగుంట వద్ద ఏలూరు కాల్వలో దూకేశాడు. బంధువుల ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది గాలించారు. బుధవారం రాత్రి ఉంగుటూరు సమీపంలో అతడి మృతదేహం లభ్యమైంది. రెండు రోజుల క్రితం మావుళ్లయ్య, రమ కలిసి తిరిగారని స్థానికులు చెప్పడంతో ఆమె కూడా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని చేబ్రోలు పోలీసులు అనుమానించి.. మంగళగిరి నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చేబ్రోలు పోలీస్‌స్టేషన్ సమీపంలోని వంతెన వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## చిక్కు విప్పడానికి ఓ లెక్క ఉంది

కార్పొరేట్ ఉద్యోగాల్లో విజయం సాధించడం సిలబస్‌లో లేని, కంటికి కనిపించని నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. వాటిని ఎక్కడా నేర్చుకోవడం సాధ్యం కాదు. అందువల్ల యువ ఉద్యోగులు నిర్ణయాలు తీసుకోవడం, ఆలోచనలు పంచుకోవడంలో తొందర పడకూడదు. చేసే ప్రతి పనిలోనూ పై స్థాయి వ్యక్తులను భాగస్వామ్యం చేస్తేనే మీ ఆలోచనలకు గుర్తింపు దక్కుతుంది. ఫలితంగా ఉద్యోగంలో ఉన్నతికీ వీలవుతుంది. ప్రతిష్ఠాత్మక కళాశాల నుంచి నవీన్ ఎంబీఏ పూర్తిచేశాడు. ఒక బహుళజాతి సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యాడు. ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం అతడిలో పుష్కలంగా ఉంది. అయితే ఉద్యోగంలో చేరాక కాలేజీలో చదివిన మార్కెటింగ్ సూత్రాలు, కమ్యూనికేషన్ సిద్ధాంతాలు పునాది మాత్రమే అనే విషయం అర్థమైంది.

**ప్రజ్ఞకూ పరిమితులు**

ఆదిత్య ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ట్రెయినీగా చేరాడు. గణాంకాల విశ్లేషణలో తలెత్తిన సున్నితమైన సమస్య విషయమై బృంద సభ్యులు మేధామథనం చేస్తున్నారు. అతడు తనకున్న పరిజ్ఞానంతో ఒక ప్రోగ్రామ్ డెవలప్ చేశాడు. దాన్ని సమావేశంలో ప్రదర్శించి సమస్య పరిష్కరించాడు. అయితే టీమ్ లీడర్ ఆదిత్యను తన ఛాంబర్‌కు పిలిచి అభినందించడానికి బదులు తన అసహనాన్ని వ్యక్తపరిచి మందలించాడు. ఇలాంటి పరిష్కారాలు సమావేశాల్లో ప్రదర్శించే ముందు తనతో చర్చించాలని, తన అనుమతితో సమీక్షా సమావేశాల్లో మాట్లాడాలని, ఇలా మరోసారి జరగకూడదని హెచ్చరించాడు. కార్పొరేట్ సంస్థల్లో సమస్య పరిష్కారం ఎంత ముఖ్యమో, ఆ పరిష్కారం ఎవరి ద్వారా జరుగుతున్నదన్నదీ అంతే ప్రాధాన్యమైంది. ఉద్యోగిగా మీ సామర్థ్యాలు, నైపుణ్యాలు పై అధికారుల ప్రాధాన్యం తగ్గిస్తున్నాయని, వారిని సవాల్ చేస్తున్నాయని అనిపిస్తే అది మీ మనుగడకే ప్రశ్నార్థకం కావచ్చు.

**తెలివిగా వ్యవహరిస్తేనే**

ఒక మార్కెటింగ్ సంస్థలో శిక్షణ అధికారిగా చేరాడు భాస్కర్. ఆ సంస్థ సీఈవో ఒక సమావేశంలో ఉద్యోగులందరూ సమానమేనన్నారు. హైరార్కీకి ప్రాధాన్యం ఉండదనీ చెప్పారు. వ్యయ నియంత్రణకు సంబంధించిన సలహాలు, సూచనలను ఉద్యోగులు ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా సీనియర్ మేనేజ్‌మెంట్‌కు తెలియజేయవచ్చనీ అన్నారు. దీన్ని నమ్మిన భాస్కర్ మార్కెటింగ్ శాఖలో 20 శాతం అనుత్పాదక వ్యయం జరుగుతున్నదని, వ్యయ నియంత్రణకు ఒక మంచి ఐడియాతో నేరుగా సీఈవోను కలిశాడు. ఈ ఆలోచన నచ్చిన అతడు భాస్కర్‌ను అభినందించి, దాన్ని అమలు చేయాల్సిందిగా టీమ్



లీడర్‌ను ఆదేశించాడు. భాస్కర్ నేరుగా సీఈవో దగ్గరకు వెళ్లడాన్ని జీర్ణించుకోలేని టీమ్ లీడర్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఫలితంగా తర్వాతి ఆరు నెలలకు భాస్కర్ పనిచేస్తోన్న శాఖలో ఒంటరివాడై, చివరికి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉన్నత స్థాయి యాజమాన్యాలు.. సంస్థలో హోదాలు, 'హైరార్కీ' ముఖ్యం కాదని చెప్పినప్పటికీ పదవీక్రమం ఒక అదృశ్య శక్తి. పై అధికారిని పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడమంటే ఉద్యోగ జీవితంలో ఎదుగుదలకు సంకెళ్లు వేసుకున్నట్లే. కొన్నిసార్లు మనుగడా ప్రశ్నార్థకమవుతుంది.

**భాగస్వామ్యం చేయాలి**

లాస్య ఒక తయారీరంగ సంస్థలో నాణ్యత-నియంత్రణ విభాగంలో అధికారిగా చేరింది. నాణ్యత ప్రమాణాల్లో తలెత్తిన సమస్యను పరిష్కరించే బాధ్యతను ఆమెకు అప్పగించారు. అందులో కీలకమైన లోపాన్ని పరిష్కరించింది. సమావేశంలో మాట్లాడుతూ.. 'మా టీమ్ లీడర్ మార్గదర్శకత్వంలో ఈ సమస్యను మేము పరిష్కరించాం' అని చెప్పింది. ఈ పరిణామంతో టీమ్ లీడర్ లాస్యకు మరిన్ని అవకాశాలు కల్పించారు. ఫలితంగా ఆమె కొత్త విషయాలెన్నో నేర్చుకోగలిగింది. సంస్థలో ఆమె ఎదగడానికి మార్గం సులువైంది. టీమ్ లీడర్ లాస్యను ప్రమోషన్‌కు సిఫారసు చేశారు.

మీ విజయంలో మీ పై అధికారిని భాగస్వామిని చేయడం వల్ల మీ విలువ పెరుగుతుంది. మీకు మీ టీమ్ లీడర్ నుంచి ఒక శక్తిమంతమైన మద్దతు లభిస్తుంది. ఈ మనోవైఖరి సంస్థలో మీ ఎదుగుదలకు సహకరిస్తుంది.

**తప్పును అంగీకరిస్తేనే**

ఎలక్ట్రానిక్స్ పరికరాలు తయారుచేసే సంస్థలో మార్కెటింగ్ అధికారిగా చేరాడు అర్జున్. బృంద సభ్యుల పని తీరు సరిగా లేకపోవడం, సభ్యుల మధ్య సమన్వయ లోపం, వినియోగదారులకు వస్తువు నాణ్యతపై అవగాహన లేకపోవడంతో అమ్మకాలు తగ్గాయి. అయితే ఆ వైఫల్యాలు కప్పిపుచ్చడానికి సాంకేతిక అంశాలపైకి తప్పు నెట్టేసి నివేదిక ఇచ్చాడు. వాస్తవాలు తెలుసుకున్న యాజమాన్యం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. సమస్యను నిజాయతీగా విశ్లేషించకపోతే తాత్కాలిక రక్షణ లభించినా దీర్ఘ కాలంలో కెరియర్ దెబ్బతింటుంది. కార్పొరేట్ సంస్థల్లో కొలువులు ఆశించేవారు సమస్యా పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఉద్యోగార్థుల ఆలోచనా విధానం, సమస్యలను తెలియజేసే తీరును సంస్థలు నిశితంగా పరిశీలిస్తాయి. సమస్యను విభజించి చూడటం, మూల కారణాలను గుర్తించడం, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. వీటి ద్వారా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం సంపాదించడంతో పాటు కెరియర్‌లో ఎదగడానికీ అవకాశం ఉంటుంది. ప్రతి యువ ఉద్యోగార్థీ సమస్యా పరిష్కారంలో కనిపించని కోణాన్ని అర్థం చేసుకోవాలి.

# విద్యార్థులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

## – ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ – పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు దాతలు కల్పించిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయి చేరుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. చందసత్రంలో సత్రం ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. చందసత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చెక్కులను కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు కారణంగా చదువు మధ్యలో ఆపేయకుండా ఇలాంటి ఉపకార వేతనాలు వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.



విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మన తలరాతలు మార్చే శక్తి కేవలం చదువుకే ఉంది... ఆస్తులు, సంపదలు లేకపోయినా చదువు ఉంటే మనిషి ఎక్కడికైనా వెళ్లగలడు... పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు" అని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలా ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం ఇస్తే వారు పెద్ద పెద్ద స్థాయిలకు చేరుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను చదువులో ప్రోత్సహించాలని, చిన్న వయసులోనే బాధ్యతలు పెట్టకుండా వారి చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. అలాగే సమాజంలో ఉన్న దాతలు, సేవా సంస్థలు పేద విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని, విద్యకు సహాయం చేయడం అంటే ఒక కుటుంబాన్నే కాదు, ఒక తరం భవిష్యత్తును మార్చినట్టేనని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సత్రం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈ.వి సుబ్బారావు, సత్రం కార్యనిర్వహణాధికారిని వి శ్రీకృష్ణ దేవి, సిబ్బంది, సత్రం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో

# నూతన కమిటీ ఏర్పాటు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యాలయం వివిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు అధ్యక్షతన బుధ వారం నూతన మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలివెల వీరబాబు విలేఖరులకు తెలియజేస్తూ సిపిఐ ఎంఎల్ పార్టీ మండల అధ్యక్షుడుగా నందమూరి చిట్టి స్వామి, ఉపాధాకుడుగా సిద్దే నాగరాజు,ఆర్థిక లావాదేవీల అధ్యక్షురాలుగా పలివెల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని పలివెల అన్నారు. మండల కమిటి మెంబెర్స్ గా వరదా దుర్గ ప్రసాద్,డొల్లా పాపారావు,గొంతే భాను ప్రియ,కడిదల రాధా,తవిటికి సునీత,కురికూరి కృపమ్మ,మేడిద సూర్య,కొత్తపల్లి ఏసమ్మ,తామాడ నాగమణి,చింతపల్లి కృష్ణ,ఈతకోత గంగాధర్,కొండేపూడి ఆదిలక్ష్మి,తెలగవరపు రమేష్,కోడి వేణు,అంద్రు మరియమ్మ,మర్రె చంటమ్మ,సిద్దె రామకృష్ణ తదితరులు ఎన్నిక కావడం జరిగిందని ఆయన అన్నారు. నూతన కమిటీలో ఎన్నిక కాబడిన వారు పార్టీ నిబంధనలకు కట్టుబడి పని చేయాల్సి ఉంటుందని అన్నారు. పార్టీ నిబంధనలను ఉల్లంఘించిన వారిని వెంటనే తొలగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఎంఎల్ పార్టీ ఐక్యంగా ఉంటుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు. పేద ప్రజల కోసం భూ పోరాటమే సిపిఐ ఎంఎల్ పార్టీ ప్రధాన అజెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడియం నర్సరీలకు అంతర్జాతీయ మార్కెట్లలో విస్తరణ అవసరం

## ఎగుమతుల దిశగా ముందడుగు వేయాలి – నర్సరీ రైతులకు కలెక్టర్ పిలుపు
## కడియం నర్సరీలకు గ్లోబల్ బ్రాండ్‌గా ఎదగాలంటే అవగాహన కీలకం : కలెక్టర్ కీర్తి చేకూరి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అందమైన పూలు, అలంకరణ మొక్కలకు ప్రఖ్యాతి గడించిన కడియం నర్సరీ రైతులు అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.గురువారం కడియంలో నిర్వహించిన "కడియం నర్సరీ నుండి ఎగుమతికి గల అవకాశాలు మరియు వ్యూహాలపై వర్క్‌షాప్" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడియం నర్సరీలకు జాతీయ స్థాయిలో మంచి బ్రాండ్ ఇమేజ్ ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరణకు ఇంకా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఎగుమతుల దిశగా మరింత చొరవ చూపాలని రైతులకు సూచించారు. దేశవ్యాప్తంగా నర్సరీల నుంచి కోట్ల రూపాయల విలువైన మొక్కలు విదేశాలకు ఎగుమతి అవుతున్నప్పటికీ, ఎంతో పేరెన్నికగన్న కడియం నుంచి తక్కువ స్థాయిలో ఎగుమతులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్లనే రైతులు అంతర్జాతీయ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం కేవలం సుమారు 10 సంస్థలు మాత్రమే ఎగుమతి లైసెన్సులు కలిగి ఉన్నాయని, ఈ సంఖ్యను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర దేశాల మార్కెటింగ్ విధానాలు, ఎగుమతి అవకాశాలపై అవగాహన పెంపొందించుకుంటే రైతుల ఆదాయం మరింతగా పెరుగుతుందని వివరించారు. నర్సరీ రైతులు గ్లోబల్ మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని, ఈ దిశగా ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు, నర్సర్సీ రైతులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో

# అంబటి రాంబాబుకు ఘన స్వాగతం

## నియోజవర్గం వ్యాప్తంగా పాల్గొన్న నాయకులు




**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసిపిలో ఫైర్ బ్రాండ్ ఇమేజ్ ఉన్న నాయకుడు అంబటి రాంబాబుకు మండపేట నియోజక వర్గంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రోజు అక్కడికి వెళ్లి రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వైసీపీ అగ్ర నాయకులను సమన్వయం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాపు సామాజిక వర్గాల నాయకులు ను సమీకరించారు. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు విడుదల తరవాత ఆయన ఇంటికి వెళ్ళి తానున్నానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్యటన కు అంబటి రాంబాబు గురువారం విచ్చేశారు. కాకినాడ లో కురసాల కన్నబాబు, ముద్రగడ పద్మనాభం లను మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుండి మండపేట విచ్చేశారు. పెద్ద కాల్వ వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నేతృత్వంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాపు సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయన కు స్వాగతం పలికారు. మండపేట విజయలక్ష్మీ నగర్ లోని వైసిపి కార్యాలయంలో తోట త్రిమూర్తులు ఆయన ను శాలువ తో ఘనం సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ పరిశీలికులు తోట రామకృష్ణ, వైసిపి భీమవరం నియోజవర్గ ఇన్చార్జ్ చినిమిల్లి వెంకటరాయుడు, వైసిపి నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, రెడ్డి రాధా కృష్ణ, కర్రి పాపారాయుడు, తోట పృథ్వీ రాజ్, టౌన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, పోతంశెట్టి ప్రసాద్, యార్రమాటి వెంకన్న బాబు, పిల్లా వీరబాబు, ఎంపీపీలు జుత్తుక వెంకటలక్ష్మి, నవుడు నౌడు వెంకటరమణ, సొసైటీ మాజీ అధ్యక్షులు పెంకె గంగాధర్,రాయవరం మండలం మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్స్ సిరివరపు శ్రీనివాస్, నక్కా సింహాచలం, కపిలేశ్వరపురం మండలం మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, దుర్గారావు, గూటం సత్యనారాయణ, సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, మండపేట రూరల్ కన్వీనర్ అడబాల బాబ్జి, కుడిపూడి రాంబాబు, పెదపాటి సత్యనారాయణమూర్తి, ఓగిరాల దేవి, జిన్నూరి సాయిబాబా, కొప్పిరెడ్డి ప్రసాద్, శ్రీ శ్రీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, మందపల్లి రవికుమార్,గారపాటి అశోక్,మందపల్లి రవి, ఎర్రగుంట అయ్యప్ప, సాధనాల శివ, అన్ని గ్రామాల ఎంపీటీసీ, సర్పంచ్లు, పార్టీ ప్రెసిడెంట్స్, తదితరులు సహా అధి సంఖ్యలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూ జేఎఫ్ కార్యవర్గం సమావేశం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక యుటిఎఫ్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గ సమావేశం గురువారం ఉదయం జరిగింది.ఏప్రిల్ నెలలో జిల్లా మహాసభ జరుపుటకు తగిన కార్యాచరణ,కొత్త సభ్యత్వాలు,నియోజకవర్గ స్థాయి కమిటీలు తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సమావేశానికి కొత్త సభ్యులను ఆహ్వానించడం తో పాటు ఏపీ బిజెఏ బలోపేతానికి APBJA బలోపేతానికి 99 బ్యూరో వెంకట్ ను ఆహ్వానించడం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ రవికుమార్,పోతుల వెంకటేష్,వరదా నాగేశ్వరావు, శ్రీనివాసాచారి, లింకన్, చెబోలురాజు, దామోదర్, హరి గణేష్, శ్రీనివాస్, మురళి, సుబ్బు, రాంబాబు, డి.ఎస్.తదితరులు పాల్గొన్నారు.


# జర్నలిస్టుల మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

## మొత్తం 233 మందికి ఉచిత వైద్య పరీక్షలు – వైద్య ఆరోగ్య శాఖ, సమాచార శాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించిందనీ, మొత్తం 233 మంది పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు.ఈ వైద్య శిబిరం రాజమహేంద్రవరం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, ఐఎంఏతో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య నిపుణులు పాల్గొని సేవలందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందించే పాత్రికేయులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిందన్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి సాధారణ పరీక్షలతో పాటు కార్డియాలజీ, గైనకాలజీ, ఈఎన్టీ, ఆర్థోపెడిక్, కంటి, దంత వైద్య సేవలు అందించబడినట్లు తెలిపారు. అలాగే మమోగ్రఫీ, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వైద్య సిబ్బంది అందించిన సేవలను కలెక్టర్ అభినందించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు సమాచారాన్ని అందించే పాత్రికేయు లకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందించడం అభినంద నీయమన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. తాను శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ శిబిరంలో పాత్రికేయులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య సేవలు అందించడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాత్రికేయుల ఆరోగ్యం పట్ల నిబద్ధత కలిగి ఉందనీ స్పష్టం చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించిన అధికారులను, వైద్య బృందాలను, జిల్లా కలెక్టర్ ను ఆయన అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కే.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ మొత్తం 233 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విభాగాల వారీగా జనరల్ మెడిసిన్ 147, గైనకాలజీ 22, ఆర్థోపెడిక్ 14, డెంటల్ 10, కంటి పరీక్షలు 23, గుండె సంబంధిత 11, చర్మ వ్యాధి 6, ఈఎన్టీ 3 కేసులు, మమో గ్రాఫీ 16, అల్ట్రాసౌండ్ 57 కి పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి



ప్రత్యేక పరీక్షలు నిర్వహించగా, 27 మందిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కే. వెంకటేశ్వర రావు, జిల్లా ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవా సమన్వయకర్త పి. ప్రియాంక, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ, పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు, 50 మంది వివిధ ఆసుపత్రుల వైద్యులు, 150 మంది వైద్య, ఆశా, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 27 మార్చి 2026
www.viswamvoice.com






# కిడ్నీ బాధితునికి ఆర్థిక చేయూత



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామానికి చెందిన వేమన నాని తన రెండు కిడ్నీలు పాడై అనారోగ్యానికి గురయ్యారు రెండు కిడ్నీలకు 20 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్ చెప్పడంతో ఆ పేద కుటుంబం దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు ఈ విషయం తెలుసుకున్న పి గన్నవరం శ్రీ భువనేశ్వరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు సాధనాల శ్రీ వెంకట సత్యనారాయణ (జెడి) సీఈవో కటిక రెడ్డి సోమేశ్వరరావు. డైరెక్టర్లు కుడిపూడి నారాయణమూర్తి. రొక్కాల రవికుమార్. సొసైటీ బ్యాంకు సిబ్బంది మరియు నాయకులతో కలిసి నానికి20వేలరూపాయలు.అందజేశారు. అలాగే బ్యాంకులో ఉన్న అతను తీసుకున్న అప్పుని రద్దు చేశామని సీఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం మండల పరిషత్ అధ్యక్షురాలు గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, నగరం ఏఎంసి డైరెక్టర్ చిట్టాల జోగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చిట్టాల రామజోగేశ్వరరావు, వేమన శ్రీనివాసరావు, వేమన సత్తిబాబు, యడ్ల ఏసుభాస్కరరావు, తాటికాయల శ్రీనివాసరావు, తాటికాయల వెంకటేష్, షేక్ దొరబాబు, తానంకి నాగరాజు, సాధనాలఖాళీ కృష్ణ, వేమన గంగబాబు, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. నానికి దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

**ఉచిత పశువైద్య శిబిరాన్ని**

# ప్రారంభించిన ఎమ్మెల్యే



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలోని పశువుల ఆసుపత్రి వద్ద అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని గురువారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిది. రైతుల జీవనోపాధికి పశువుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమైనది. ఈ శిబిరం ద్వారా పశువులకు ఉచిత వైద్య సేవలు, టీకాలు, నివారణ మందులు అందించడం రైతులకు ఎంతో ప్రయోజనకరం అని ఎమ్మెల్యే గడ్డి సత్యనారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు మార్గదర్శకత్వంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతాయి అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్య కర్తలు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామారెడ్డికి మాతృవియోగం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ ఫోటోగ్రాఫర్స్ అధ్యక్షుడు, కోనసీమ జిల్లా ప్రస్తుత ఉపాధ్యక్షుడు ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన నల్లమిల్లి రామారెడ్డి మాతృమూర్తి నల్లమిల్లి సత్యవతి దైవ సన్నిధికి చేరారు. ఆమె అకాల మృతికి కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), కట్టా శ్రీనివాస్, నాంధ్ర నాగమోహన్ రెడ్డి, తాడి ఆదిత్య రెడ్డి, పలువురు సంతాపం తెలిపారు.

**దొమ్మేటి జయంతి రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై**

# ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు హర్షం




**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతి పితామహుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గం, తాళ్లరేవు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, శెట్టిబలిజ జాతి అభ్యున్నతికి స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల సాధికారత, విద్యాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని తెలిపారు. నారా లోకేష్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ద్వారా కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకుందని పేర్కొన్నారు. ఇది శెట్టిబలిజ సమాజానికి గౌరవప్రదమైన నిర్ణయమని అన్నారు. అలాగే, శెట్టిబలిజ సోదరుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి , విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి రంగాలలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఘన నివాళులర్పించారు.

**శెట్టిబలిజ జాతి చరిత్రలో సువర్ణ అధ్యయ మాట**

# నిలబెట్టుకున్న నారా లోకేష్, గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శెట్టిబలిజ జాతి చరిత్రలో సువర్ణ అధ్యాయం దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా ప్రకటించటం. మార్చి 23వ తేదీనీ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా ప్రకటించడం శెట్టిబలిజ చాతి చరిత్రలో సువర్ణ అధ్యయంగా లిఖించబడ్డ రోజుగా పరిగణించబడుతుంది. దానికి ముఖ్య కారకులు మంత్రి నారా లోకేష్ అని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి అన్నారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా ప్రకటించిన మంత్రి నారా లోకేష్‌ను సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. యావత్ శెట్టిబలిజ జాతి రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. కృషి చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబులకు కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలిపారు.వారికి సహకరిస్తున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి లకు ధన్యవాదాలు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి స్వగ్రామమైన బోడసుకుర్రు వంతెనకు దొమ్మేటి వెంకటరెడ్డి వారధిగా ప్రభుత్వం నామకరణం చేయాలని భావితరాలకు తెలిసేలా దొమ్మేటి వెంకటరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత జాతి సోదరులపై ఉందని బాధ్యత తీసుకున్న పెద్దలకు అందరూ సహకరించాలని గుబ్బల మూర్తి విజ్ఞప్తి చేశారు.

# ఎల్పీజీపై అపోహాలు సృష్టిస్తే కఠిన చర్యలు

**జిల్లా పౌరసరఫరాల అధికారి హెచ్చరిక**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై అపోహాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను హెచ్చరించారు. గృహ వినియోగానికి ఇచ్చే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదని స్పష్టం చేశారు. గ్యాస్ వినియోగంపై ఎవరైనా అనవసర ప్రచారం చేసి అపోహాలు కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో గృహ గ్యాస్ కొరత లేదని, సరఫరాలో ఎలాంటి లోపాలు లేవని చెప్పారు. అయితే కొంతమంది అధికంగా బుకింగ్ చేసుకోవడం వల్ల తాత్కాలిక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. గ్యాస్ బుకింగ్ లేదా సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే కమాండ్ కంట్రోల్ నంబర్ 94416 92275కు ఫిర్యాదు చేయాలని సూచించారు. గృహ అవసరాల సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే నిత్యావసరాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్యాస్ ఏజెన్సీలు గృహ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలాల వారీగా తహసీల్దార్లు, సివిల్ సప్లై అధికారులు ప్రతిరోజూ గ్యాస్ ఏజెన్సీల నిల్వలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడు బండ్లపై తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎల్పీజీ పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్లు తెలిపారు. గ్యాస్ కొరతను కారణంగా చూపుతూ అదనపు సేవా ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సిసిపిఎ) హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు ఎల్పీజీ పేరుతో వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిన నేపథ్యంలో ఈ హెచ్చరికలు జారీ చేసినట్లు వివరించారు.

# జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈరోజు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని స్టేషన్ హౌస్ అధికారులు, పోలీసు సిబ్బంది ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి సారించారు. వయసు నిండకముందే వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి వాహనం నడపడం పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించడంతో పాటు ప్రాణ రక్షణలో హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అతి వేగంగా వాహనాలు నడిపే వారిపై కూడా చర్యలు తీసుకున్నారు. కేవలం జరిమానాలు విధించడం మాత్రమే కాకుండా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. రహదారి నిబంధనలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను, ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రజల రక్షణే మా ప్రాధాన్యత. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ముఖ్యంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలపై ముప్పు తెచ్చుకోకూడదు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలు నివారణే లక్ష్యంగా హెల్మెట్ ధరించాలి

**రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఎస్సై నరేష్**



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** హెల్మెట్ భారం కాదు.. మన ప్రాణానికి రక్షణ కవచమని మన కోసం ఇంట్లో ఎదురుచూసే ప్రాణాలున్నాయని, హెల్మెట్ ధరించడం మర్చిపోకూడదని, తల రాతను మార్చలేం కానీ... తలకు హెల్మెట్ పెట్టి చావును తప్పించుకోవచ్చునని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ నుండి మడికి వరకు 216ఏ జాతీయ రహదారిపై వెళ్ళు ద్విచక్ర వాహనదారులకు ఆలమూరు ఎస్సై జి.నరేష్‌తో కలిసి హెల్మెట్ దారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి మీ ప్రాణాలు కాపాడుకోవాలని, రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా హెల్మెట్లు ధరించాలని అన్నారు, అనంతరం హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**లస్కర్ల జీతాల పెంపుపై**

# హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దాట్ల



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం లస్కర్ల జీతాలను పెంచిన నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి లస్కర్లు ఈరోజు మురమళ్ళ క్యాంపు కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ లస్కర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా నెలకు రూ.6,000 జీతం పెంపు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని అన్నారు. లస్కర్లు సాగునీటి కాలువల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వ్యవసాయానికి వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుది శ్వాస విడిచిన గిడ్డి వెంకట్రావు

**భారీగా తరలి వచ్చిన అభిమానులు, గ్రామస్తుల నివాళులు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం తానేలంక పెదపేట గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ రిటైర్డ్ ఉద్యోగి గిడ్డి వెంకట్రావు కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పల్లెటూరులో సాధారణ కుటుంబంలో జన్మించిన వెంకట్రావు విద్యనే జీవితానికి ఆధారం అనే నమ్మకంతో కష్టపడి చదివి ఉద్యోగాన్ని సాధించారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యతను నెరవేర్చాలనే లక్ష్యంతో కృషి చేసి జీవితం నిర్మించుకున్నారు. సీలేరు అటవీ ప్రాంతంలోని పవర్ ప్రాజెక్ట్‌లో సుమారు 40 సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించారు. తన సేవా కాలంలో సహచరులకు ఆదర్శంగా నిలుస్తూ, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి మంచి పేరు, గౌరవాన్ని సంపాదించారు. స్వగ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి సహాయం చేసే స్వభావం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన, శుక్రవారం తుది శ్వాస విడిచారు. వెంకట్రావుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. అంతిమ యాత్రకు పరిసర గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. ఆయన స్మారకార్థం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తాం

**లైబ్రరీ నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తాం**



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల కేంద్రంలో కాట్రేనికోన పంచాయతీ వెనుక సుమారు 5 ఎకరాల పంచాయతీ చెరువు కబ్జాలకు గురైన విషయమై మై న్యూస్ గ్రూప్లో వచ్చిన వార్తకి తాసిల్దార్ రవి కిరణ్ స్పందించారు. గురువారం పంచాయతీ కార్యదర్శి జేవివి సత్యనారాయణ, తహసిల్దార్, సర్వేయర్‌లతో కలిసి ఆక్రమణకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తామని గతంలో పంచాయతీ వెనుక లైబ్రరీ ఉండేది. పంచాయతీ నిర్మాణం నిమిత్తం దీనిని తొలగించారు. ప్రస్తుతం వేరేచోట లైబ్రరీ నిర్వహిస్తున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. లైబ్రరీ భవనాన్ని పునరుద్ధరించాలని పాఠకులనుండి డిమాండ్ ఉంది.

# గ్యాస్ బండ..



గ్యాస్ బండా...
గ్యాస్ బండా...
ఎంత పని చేశావే దొంగ బండా...
నీవే అనుకున్నాం మా అండా దండా...
మమ్మల్ని ముంచుతున్నావు కదే నిండా...
నీవు లేకుంటే పొయ్యేక్కదు కుండ...
ఎన్ని రోజులుండమంటావు తిండి లేకుండా...
చేస్తున్నావు కదే రచ్చబండ...
నీ ముఖం మండా....

నీవు లేకుంటే అయ్యింది అంతా తల్లకిందు...
ఇంట్లో ఆడవాళ్లు వేస్తున్నారు చిందు...
బయటేమో రెస్టారెంట్లు బందు...
ఇంటా బయటా లేదు విందు...
నీవు లేకుంటే ఉండదు పసందు...
నిన్ను దోసుకునే వారికి దొరికింది సందు...
ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి ముందు...

ఎక్కడో జరిగింది యుద్ధం...
ఇక్కడేమిటి మాకీ రాద్దాంతం...
ఏమిటో ఈ పరమార్థం...
దేవునికే తెలియాలి యదార్థం...
నిన్ను బుక్ చేసుకోవాలంటే పెడుతున్నారు ఎన్నో ఆంక్షలు.కావడం లేదు మాకర్థం ...

ఏదేమైనా గ్యాస్ బండతో ఎప్పటికైనా ముప్పే...
దీనికి అలవాటు పడడం మన తప్పే...
అందరికీ కలగాలి కనువిప్పు...
మెల్ల మెల్లగా కట్టెల పొయ్యిలకు పెట్టాలి నిప్పు...
లేకుంటే ఎక్కి కూర్చుంటుంది గ్యాస్ బండ ధరల పై కప్పు...



సహజ కవి
వెంకట్ పొలమూరి
అంబాజీపేట.

**కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న**

# వేమన నానికి ధన సాయం చేసిన బాలుడు



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం లంకల గన్నవరం వేమనవారిపాలెం గ్రామానికి చెందిన వేమన నానికి పొలిమేర నడిగాడికి చెందిన ఏనుగుపల్లి బెంజమిన్ శామ్యూల్ అనే 5వ తరగతి విద్యార్థి తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.8,040లను నానికి అందజేశారు. నాని వైద్యం నిమిత్తం చిన్నారులు సైతం ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయడం అందరికీ ఆదర్శంగా నిలిచాడు. నాని ఆయురారోగ్యాలతో కోలుకోవాలని శామ్యూల్ కోరుకున్నాడు. ఈ చిన్నారి చేసిన సాయాన్ని పలువురు అభినందించారు.

**సీనియర్ జర్నలిస్టు ముద్దన సుబ్రహ్మణ్యం కుటుంబానికి**

# యూనియన్ ఆర్థిక సహాయం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

పత్రికా రంగంలో దశాబ్ద కాలంగా వార్తా సేకరణలో విశిష్ట సేవలందించిన సీనియర్ విలేకరి ముద్దన సుబ్రహ్మణ్యం అకస్మిక మరణం పట్ల ఎపిడబ్ల్యూ జెఎఫ్ - ఎ పి బి జె ఎ యూనియన్ ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు సమర్పించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.10,000 చెక్కును అందజేశారు. పలువురు మాట్లాడుతూ స్నేహశీలి, కర్తవ్యనిష్ఠ గల జర్నలిస్టుగా సుబ్రహ్మణ్యం సేవలను స్మరించుకున్నారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు వాతాడ నవీన్, జర్నలిస్టులు మట్టపర్తి శ్రీనివాస్, సమయమంతుల హరి, కడలి రాజు, పెయ్యల వెంకటేశ్వరరావు, కడలి సూరిబాబు, పరమట భీమా మహేష్, మోత వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల నీలకంఠం, కే.మూర్తి, బి.అగ్ని, బి.రాము, బడుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# దివ్య చరితం ఎస్.జగ్గంపేట సీతా రాముల కళ్యాణం...!

## కల్యాణానికి ఎస్.జగ్గంపేట ఆలయం సిద్ధం - సంప్రదాయాన్ని కాపాడ్డానికి ధర్మకర్తల కృషి





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ సీతారాముల కళ్యాణం లోక కల్యాణం. జగదానంద కారకుడు, జానకీ, జన నాయకుడు జగదభిరాముడు శ్రీ రాముడు కల్యాణానికి పల్లెల్లోని రామాలయాలన్నీ పచ్చని చలువ పందిళ్ళతో ముస్తాబై శుభ ఆహ్వానం పలుకు తున్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల్లోని శ్రీసీతారామ ఆలయాల వద్ద 17 న అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవ నిర్వహణా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఆలయాలన్నీ దేవుడి కల్యాణ సిద్ధపాటు శోభతో కళకళలాడు తున్నాయి. శ్రీ సీతారామ నవమిని పురస్కరించుకొని మండలంలోని శంఖవరం జగ్గంపేట పంచాయతన శ్రీ సీతారామచంద్ర మూర్తి ఆలయం వద్ద కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసారు. శ్రీసీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఉదయం 10 గంటల శుభలగ్నంలో శాస్త్రోక్తంగా, వైభవంగా, భక్త జన రంజకంగా నిర్వహించేందుకు పురోహితులు సంప్రదాయ లాంఛనాలను పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని రక రకాల ఆకులు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

**126 ఏళ్ళ చరిత్రాత్మక రామాలయం....!**

ఈ ఆలయం 126 ఏళ్ళ చరిత్రాత్మకమైనది. క్రీస్తు శకం 1,900 వ సంవత్సరంలో మోగంటి కొండరాజు, మల్లపురాజు అన్నదమ్ములు సంయుక్తంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయం అభివృద్ధికి, ఉత్సవాల నిర్వహణ, దూప దీప నైవేద్యాలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు మూల నిధిగా శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో 75 ఎకరాల భూమిని ఆలయానికి దారాదత్తం చేసారు. ఇందులో శంఖవరం మండలంలో ఆలయం ఉన్న స్థానిక ఎస్.జగ్గంపేట పరిధిలో 17 ఎకరాలు, వేళంగి సమీపంలో 47 ఎకరాలు, రౌతులపూడి మండలం గుమ్మరేగుల పరిధిలో 11 ఎకరాలు, చొప్పున మొత్తం 75 ఎకరాల భూములను ఈ ఆలయానికి దానం చేస్తూ నేటీ మోగంటి వంశ పూర్వీకులు మోగంటి కొండరాజు, మల్లపురాజు అన్నదమ్ములు సంయుక్తంగా రాసిచ్చారు. వేళంగి సమీపంలోనే 47 ఎకరాల భూమిని అప్పట్లో పీపుల్స్ వార్ నక్సలైట్లు స్వాధీనం చేసుకుని అక్కడి పేదలకు పంచి పెట్టేసారు. ఇది ఇప్పటికి ఈ అక్రమ ఆక్రమణల చెరలోనే ఉంది. కొంతంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జగ్గంపేట పరిధిలో ఆలయానికి చెందిన కొంత భూమిని ఆక్రమించు కున్నారు. ఈ ఆక్రమణల వల్ల ఆలయానికి ఏటేటా సమకూరే ఆదాయంలో కొంత తగ్గి పోయింది. మిగిలిన 30 ఎకరాల భూములపై సంవత్సరానికి సుమారు రూ. 3.43 లక్షలకు పైగా ఆదాయం (ఇవి పాత గణాంకాలు) వస్తున్నది. ఈ కల్యాణానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు హాజరు అవుతారు. సుమారు 800 నుంచి 1,000 మంది వరకూ మధ్యాహ్నం అన్నసమారాధనలో పాల్గొంటారు. 126 ఏళ్ళ చరిత్రాత్మక ఈ రామాలయంలో క్రమం తప్పకుండా ఏటేటా శ్రీసీతా రాముల కళ్యాణాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సంప్రదాయాన్ని కాపాడేందుకు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తల మండలి కృషి చేస్తూ వస్తోంది.

# పలువురిని పరామర్శించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం, సుంకర పాలెంలో సుధీర్ఘ కాలం పాటు మునసబు విఆర్ఓగా సేవ లందించి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన గుంట ముక్కల వీరబద్రరావు చిత్ర పటానికి గురువారం ఎమ్మెల్సీ తోటత్రిమూర్తులు నివాళులర్పించి సోదర వియోగంతో బాధపడుతున్న తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గుంట ముక్కల సూరి బాబును మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చిక్కం హనుమంతరావు, సుంకర రామ చంద్రరావు, గుంటముక్కల విష్ణు, తోట బాబి, మద్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దనాపల్లిలో గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్

# ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు

### శ్రీ సీతారాముల 103వ కళ్యాణ మహోత్సవములు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 27 నుండి జరగనున్న శ్రీ రామనవమి సందర్భంగా పెద్దనాపల్లి గ్రామంలో గ్రామ పెద్దలు 1923 సంవత్సరంలో నిర్మించిన పురాతన రామాలయం నందు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవము నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షులు.గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ మరియు అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి తెలిపారు. శ్రీ సీతారాముల 103 వ కళ్యాణ మహోత్సవములతో పాటు గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ద్వారా "ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీ"లను జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల క్రీడా మైదానం, పెద్దనాపల్లి నందు నిర్వహించడంజరుగుతుందని తెలిపారు. ఈ నెల 27 నుండి 30 వరకు తొమ్మిది నాటిక ప్రదర్శనలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గ శాసనసభ్యులు, టి.టి.డి పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తోపాటు పలువురు ప్రముఖులు లకు ఆహ్వానం తెలియజేసమని తెలిపారు, ప్రజలందరూ ఈ నాటికలను తిలకించి కళా రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గొల్లపల్లి బుజ్జి, కళాపరిషత్తు సభ్యులు తన అనుచరులతో ప్రదర్శన చేపట్టారు.

# పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ వెనుక అసలు కారణం ఇదేనా?




యుద్ధం మొదలై దగ్గర దగ్గర నెల కావొస్తోంది. మిగిలిన దేశాల్లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. పిలిఫ్ఫీన్స్ లాంటి దేశంలో అయితే చమురు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇలాంటి వాటితో చూసుకుంటే.. మన దేశంలో ధరల పెంపు లేదు. దానికి తోడు కొరత అన్న మాట వినిపించింది లేదు. అయితే.. అనూహ్యంగా గడిచిన మూడు రోజులుగా.. మరీ ముఖ్యంగా చెప్పాలంటే ఆదివారం తర్వాతి నుంచి పరిస్థితుల్లో మార్పు వచ్చింది. కొన్ని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వటం.. అది కాస్తా వైరల్ గా మారటంతో సోమవారం పరిస్థితి మారింది. మంగళవారానికి వచ్చేసరికి ఆ ఇష్యూ తీవ్రత పెరగటంతో పాటు.. పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపించటం భారీగా పెరిగాయి. బుధవారంనాటికి వచ్చేసరికి అదో పెద్ద ఇష్యూగా మారటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి చమురు సంస్థలు.. పెట్రోల్ బంక్ యజమానుల సంఘాలు.. పౌర సరఫరాశాఖ అధికారుల వరకు అందరూ సీన్లోకి రావటం.. పెట్రోల్, డీజిల్ కొరత లేదన్న ప్రకటనలు ఎవరికి వారిగా ఇస్తూ.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న మాటను పదే పదే చెబుతున్నారు. అయినా.. పరిస్థితుల్లో మార్పు రాని పరిస్థితి. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్ని పక్కన పెడితే.. తెలుగు రాష్ట్రాల్లో మరి ముఖ్యంగా హైదరాబాద్, విశాఖ, విజయవాడ తదితర నగరాలు.. పట్టణాల్లో పెట్రోల్, డీజిల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వటానికి కారణమేంటి? అన్న విషయంలోకి వెళితే.. పలు అంశాలు కారణాలుగా కనిపిస్తాయి. వీటిల్లోకి వెళితే..

**బ్యాలెన్స్ షీట్ ఇష్యూలు**

తాజాగా కనిపిస్తున్న పెట్రోల్ కొరతకు కారణం చమురు సంస్థలు.. బ్యాంకులు అనుసరించే బ్యాలెన్స్ షీట్ వ్యూహాలుగా చెబుతారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తున్నకొద్దీ దేశంలోని సంస్థలు తమ వార్షిక లెక్కల్ని సరి చేస్తుంటాయి. తాజా పరిస్థితుల్లోనూ ఎప్పటిలానే లెక్కలు తేల్చాలన్న పట్టుదల ఇంధన సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయానికి కారణంగా చెప్పాలి.

**చమురు కొరత లేదా?**

నిజంగానే దేశంలో చమురు నిల్వల కొరత ఏ మాత్రం లేదన్న మాట పదే పదే ప్రభుత్వంతో పాటు చమురు సరఫరా సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. నౌకలకు చెల్లించే బీమా ప్రీమియాలు 30–50 శాతం పెరిగాయి. దీంతో చమురు దిగుమతి ఖర్చు భారీగా పెరిగింది. అదే సమయంలో సాధారణ పరిస్థితుల్లో వారంలో చేరుకోవాల్సిన ముడి చమురు నిల్వలకు ఇప్పుడు 15–20 రోజులు పడుతోంది. ఈ ఆలస్యం దేశీయ రిఫైనరీల మీద నిల్వల ఒత్తిడి పడుతోంది. అయితే.. ఇప్పటికిప్పుడు ఈ ప్రభావం చూపే పరిస్థితి లేదు. దీర్ఘకాలంగా యుద్ధం సాగి.. సరఫరా మరింత ఆలస్యమైతే తప్పితే ఇబ్బందులు ఉండవు.

**మరి.. నో స్టాక్ బోర్డులు ఎందుకు?**

పెట్రోల్ బంకుల్లో నిల్వలు లేకపోవటానికి అసలు కారణం కంపెనీల వద్ద స్టాక్ లేకపోవటం కాదు. ఇదే విషయాన్ని ఇప్పటికే చమురు సంస్థలు పదే పదే స్పష్టం చేయటమే దీనికి నిదర్శనం. అదే సమయంలో పెట్రోల్ బంకుల యజమానుల సంఘాల వారు కూడా చెబుతున్నారు.

**సమస్య ఎక్కడ ఉంది?**

అసలు కారణం కంపెనీ వద్ద స్టాక్ లేకపోవటం కానే కాదు. అసలు సమస్య అంతా ఆర్థిక సంవత్సరం (ప్రతి ఏడాది మార్చి 31నాటికి ముగిసేది) ముగింపునకు వర్తించే నిబంధనలే దీనికి కారణంగా చెప్పాలి. మామూలు రోజుల్లో డీలర్లకు చమురు మార్కెటింగ్ సంస్థలు కొన్ని రోజుల రుణ పరిమితిని ఇస్తాయి. మార్చి నెల చివర మాత్రం దీన్ని తగ్గిస్తాయి. అప్పటివరకు ముందు చెల్లింపులు లేకుండానే పెట్రోల్ పంపుతాయి. కానీ.. మార్చి రెండు వారం తర్వాత నుంచి మాత్రం డబ్బులు చెల్లింపులు జరిపిన తర్వాతే స్టాక్ రిలీజ్ చేస్తాయి. ఈ రూల్ కొత్తదేం కాదు. చాలామంది డీలర్లు నగదు సర్దుబాటు చేసుకోలేక కొత్త ఆర్డర్లు పెట్టలేకపోతారు. విడి రోజుల్లో ఇదేం సమస్య కాదు. యుద్ధం కారణంగా కొరత భయాందోళనలు ఉన్నప్పుడు మాత్రం ఇవన్నీ లేని కొరతకు కారణమవుతుంది. ఇప్పుడు జరిగింది కూడా అదే. పెట్రోల్ బంకు యజమానులు క్యాష్ సర్దుబాటు చేయటంలో జరిగిన తప్పులు.. నో స్టాక్ బోర్డులు కనిపించేలా మారింది.

**ఫ్యూచర్ అవసరాలకు కొనేయటం**

సాధారణ రోజుల్లో వంద రూపాయిలకు పెట్రోల్ కొట్టించే టూవీలర్ వ్యక్తి.. పెట్రోల్ దొరకదు అన్నప్పుడు రూ.వెయ్యి పెట్రోల్ కొట్టిస్తాడు. ఒకళ్లు.. ఇద్దరు అలా చేస్తే ఫర్లేదు. లక్షలాది మంది అలా చేస్తే ఏమవుతుంది? పెట్రోల్ బంకుల్లో నిల్వలు పూర్తి అవుతాయి. ఇప్పుడు జరిగింది కూడా అదే. దీన్నే ప్యానిక్ బయ్యింగ్ గా పేర్కొంటారు. తక్షణమే అవసరం లేకున్నా.. భవిష్యత్తు అవసరాల కోసం ముందుగా కొనేసి ఉంచటం.

**బ్యాంకులు కూడా కారణం**

చమురు డీలర్లు బ్యాంకుల నుంచి స్వల్ప కాలిక రుణాలు తీసుకొని చమురు సంస్థలకు డబ్బు చెల్లిస్తూ ఉంటారు. కానీ.. ఆర్థిక సంవత్సరం చివర్లో బ్యాంకులు సైతం తమ రుణాలను వీలైనంత తక్కువగా చూపించే ప్రయత్నం చేస్తాయి. ఇందులో భాగంగా పాత బకాయిలు క్లియర్ అయ్యేలా చూసుకోవటం.. కొత్త రుణాలు ఇవ్వకుండా ఆపుతాయి. ఈ పరిస్థితి చివరకు పెట్రోల్ బంకు యజమానులకు తలనొప్పిగా మారింది. ఇలాంటి సాంకేతిక కారణాలు అన్ని కలగలిసి చివరకు నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చేలా చేశాయి.

# కత్తిపూడిలో ప్రైవేట్ బస్సుల్లో తనిఖీలు..!




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, అన్నవరం పోలీసులు, ప్రత్తిపాడు అగ్ని మాపక కేంద్రం సిబ్బంది అప్రమత్తం అయ్యారు. కత్తిపూడి జాతీయ రహదారిలో రవాణా, పోలీస్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు గ్రామ ముమ్మర తనిఖీలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు, అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాముడు, తుని రూరల్ ఎస్ఐ. విజయ్ బాబు పాల్గొన్నారు.


# గొల్లపాలెంలో అసీలు వేలంపాట

### రూ.4.31 లక్షలకు ఆసీలు పాట ఖరారు



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెంలో వారపుసంతలు, డైలీ మార్కెట్లలో ఆసీలు వసూళ్ళ నిర్వహణకు గురువారం వేలంపాట నిర్వహిచారు. పంచాయితీ కార్యదర్శి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటలో డిప్యూటీ ఎంపిడీఓ చక్రపాణి పాల్గొని రెండు విభాగాలుగా వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు పోటీపడగా కట్టా శ్రీను వారపుసంత ఆసూళ్ళు. వసూళ్ళకు రూ లక్ష 30 వేలు హెచ్చుధరకు పాట దక్కించుకోగా మాత నాగారాజు డైలీ మార్కెట్లలో అసూళ్ళ వసూళ్ళకు రూ. మూడు లక్షల ఒక వెయ్యి హెచ్చుధరకు పాట దక్కించుకున్నారు. గత ఏడాది మొత్తం అసూళ్ళ పాట రూ 3. 96 లక్షలకు జరుగగా ఈ ఏడాది 4. 31 లక్షలకు పెరిగిందని డిప్యూటీ ఎంపీడిఓ చక్రపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పోతురాజు ప్రశన్నమౌనిక, ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పాలకవర్గ సభ్యులు అంగర శ్రీను. పంచాయతీరాజ్, రెవిన్యూ సిబ్బంది పాల్గోన్నారు.

# జగన్ రాకపోతే.. ఆగిపోతుందా : అయ్యన్న



"ఏం.. జగన్ రాకపోతే.. ఆగిపోతుందని అనుకుంటున్నారా?" అని ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా భేటీ అవుతోంది. రాజధాని అమరా వతికి సంబంధించిన చట్ట బద్ధత కోసం ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం.. దీనికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకునేలా.. చర్చించి, తీర్మానాన్ని రూపొందించి.. కేంద్రానికి పంపించనుంది. తద్వారా ప్రధాన ఘట్టం పూర్తవుతుంది. ఈ క్రమంలోనే శనివారం ప్రత్యేకంగా అసెంబ్లీని హాజరుపరచనున్నారు. దీనిపై స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ.. సభ ఒక్కరోజు మాత్రమే జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే సభ తీర్మానం పూర్తయ్యే వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అమరావతిలో ఏం జరిగింది? ఏం జరుగుతుంది? చట్టబద్ధత వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? అనే అంశాలపై సభ్యులు చర్చించనున్నారని తెలిపారు. ఈ సభలకు కూడా వైసీపీకి ఆహ్వానం ఉంటుందన్నారు. తమ పనిని తాము చట్టం పరిధిలో నిబంధనల మేరకు చేస్తున్నట్టు తెలిపారు. అయితే.. సభకు రావడం, రాకపోవడం అనేది వారి ఇష్టమని వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా తన సూచన అయితే.. సభకు వచ్చి అమరావతిపై జరిగే చర్చలో పాల్గొంటే బాగుటుందన్నారు. బాధ్యతాయుత మాజీ ముఖ్యమంత్రిగా జగన్ వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఆయన సభకు రావడం లేదని.. ఇప్పుడు కీలక చర్చ నేపథ్యంలో ఆయన సభకు రావాలని సూచించారు. అయితే.. జగన్ వచ్చినా రాకపోయినా.. ఏదీ ఆగదని అయ్యన్న చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారని తెలిపారు. జగన్ కోసం ఇప్పటి వరకు ఏదైనా ఆగిందా? అని మీడియాను ప్రశ్నించారు. ప్రతి సందర్భంలోనూ మంకు పట్టు పనికిరాదన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా అనేది తాను కూడా ఇచ్చేది కాదన్నారు. ఇది ప్రజలు ఇవ్వాలని వైసీపీకి సూచించారు.

### విద్య, పేదల వైద్యం

# మాకు అత్యంత ప్రాధాన్యాంశాలు

## సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యా నికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలను పెండింగ్‌లో ఉంచిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వం రూ.2,408 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించినట్లు సీఎం వివరించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్–1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. విదేశాల్లో నిపుణులైన వైద్యుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామ న్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు.





# భద్రాద్రి కళ్యాణం కొబ్బరికాయలను తిలకించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి శ్రీ సీతారాములవారి దివ్య కళ్యాణ మహోత్సవానికి మండపేట నుండి ప్రత్యేకంగా తయారు చేసిన కళ్యాణ కొబ్బరి బొండాలు భద్రాచలం తరలించబడుతున్న సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వాటిని తిలకించి నమస్కరించారు. మండపేటకు చెందిన కాజులూరి వెంకట అచ్యుత రామరెడ్డి--మహాలక్ష్మి దంపతులు ప్రతి సంవత్సరం భద్రాచలం శ్రీ సీతారాములవారి కళ్యాణానికి కొబ్బరి బొండాలు తయారు చేసి సమర్పించడం పరంపరగా కొనసాగిస్తున్నారు. ఈ బొండాలను భద్రాచలం తీసుకెళ్తూ మార్గమధ్యంలో రాజమండ్రిలోని గంగరాజు కోవా అధినేత నిమ్మలపూడి గోవింద్ నివాసం వద్ద కొద్దిసేపు బస చేయడం ఆనవాయితీగా ఉంది. ఈ రోజు కూడా అదే విధంగా జరుగగా, పక్కనే చందసత్రంలో ఒక కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అక్కడికి వెళ్లి భద్రాద్రికి తీసుకెళ్తున్న కొబ్బరి బొండాలను దర్శించుకున్నారు. 2000 సంవత్సరం నుంచి భద్రాచలం వెళ్లి స్వామి వారికి ఈ కొబ్బరి బొండాలు సమర్పించడం తనకు దక్కిన అదృష్టమని రామరెడ్డి తెలిపారు. గత 26 సంవత్సరాలుగా ప్రతి శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారి కళ్యాణానికి ఈ బొండాలు సమర్పిస్తున్నామని చెప్పారు. సాధారణంగా హిందూ వివాహాలలో వధూవరుల చేతుల్లో పచ్చని కొబ్బరి బొండాలు ఉంచడం సంప్రదాయం కాగా, ప్రత్యేక అలంకరణతో తయారు చేసే రామరెడ్డి బొండాలు కళ్యాణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది ఉగాది పర్వదినం నుంచి బొండాల తయారీ ప్రారంభించి బుధవారం పూర్తి చేశారు. భద్రాచలం శ్రీ సీతారాముల వారి కళ్యాణం ఈ నెల 27న శ్రీరామ నవమి సందర్భంగా జరగనుంది. ఈ సందర్భంగా కొబ్బరి బొండాలతో పాటు కురిడి కొబ్బరి చిప్పలు రెండు జతలు, ప్రత్యేక కర్పూర దండలు, తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, గాజులు, పూలు కూడా సమర్పించనున్నారు. మల్లె, కనకాంబరం, చామంతి, గులాబి వంటి ఐదు రకాల పూలను అక్షింతలుగా సమర్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఒంటిమిట్ట శ్రీ సీతారాములవారి కళ్యాణం ఈ నెల 30న జరగనుండగా, అక్కడ కూడా రామరెడ్డి దంపతులు కళ్యాణ బొండాలు సమర్పించనున్నారు. అదేవిధంగా విజయనగరం రామతీర్థం, సింహాచలం, గొల్లల మామిడాడ, సత్యవాడ, రామచంద్రాపురం, ఏడిద, మండపేట శ్రీ సీతారామ క్షేత్రం తదితర దేవాలయాలకు కూడా శ్రీరామ నవమి సందర్భంగా కొబ్బరి బొండాలు అందజేస్తారు. మొత్తం 13 దేవాలయాలకు 34 కొబ్బరి బొండాలు సిద్ధం చేశారు. ప్రతి ఏడాది అంతర్వేది, అన్నవరం, ద్వారక తిరుమల, బిట్రగుంట, యాదాద్రి తదితర ఆలయాలకు కూడా స్వామివారి కళ్యాణాలకు బొండాలు తయారు చేసి ఉచితంగా అందజేస్తున్నామని రామరెడ్డి తెలిపారు. ఈ బొండాల తయారీలో తన భార్య మహాలక్ష్మి, కుమార్తెలు శరణ్య, నైనా శ్రీ ఎంతో సహకరిస్తున్నారని చెప్పారు. భక్తి, నిష్టలతో స్వామివారికి ఈ సేవ చేయడం తమ కుటుంబానికి దక్కిన అదృష్టమని రామరెడ్డి తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ కళ్యాణ కొబ్బరి బొండాలను దర్శించుకుంటున్నారు. రామరెడ్డి తయారు చేసే బొండాలు ఎంతో ప్రసిద్ధి చెందగా, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు తమ ఇళ్లలో జరిగే కళ్యాణాలకు కూడా ఈ బొండాలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

# కంటేను పరామర్శించిన శాసనసభ్యులు బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవరావు బావ చిట్టూరి వెంకటరత్నం ఇటీవల స్వర్గస్తులైనారు. గురువారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తదితరులు, కంటే నాగ కేశవరావును పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. స్వర్గీయ చిట్టూరి వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్రొవిడి సత్రాజు, అడపా శ్రీనివాస్, కంటే గణపతి తదితరులు పాల్గొన్నారు.

# పలు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని గాదరాడ నరసాపురం తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబసభ్యులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. గురువారం నరసాపురం, గాదరాడ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యుల పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా వివిధ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీతో పాటు బత్తుల కుటుంబం అన్నివిధాల బాధితులకు వెన్నుదన్నుగా నిలుస్తుందని, ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు డ్రైనేజీలకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయండి : బత్తుల

### నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు తయారుచేయాలని సంబంధిత అధికారులను రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. గురువారం రాజానగరం జనసేన పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి ప్రతిపాదనల కోసం పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు,పుంత రోడ్లు నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయిలో నివేదికలు అందజేయాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో కోట్లాది రూపాయల నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఆ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ట్యాంకులు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

### క్రైస్తవ మతం తీసుకుంటే ఎస్సీలకు రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఖండించిన బీఎస్పీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. గురువారం రాజమండ్రి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మపు చిత్ర సేను మాట్లాడుతూ క్రైస్తవ మతం తీసుకుంటే ఎస్సీ లకు రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 2021లో పాస్టర్ చింతాడ ఆనంద్, అక్కల రామిరెడ్డి కేసులో మార్చి 24వ తేదీన చింతాడ ఆనంద్ కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు క్రైస్తవ మతం తీసుకున్న వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు వర్తించదని తీర్పు ఇచ్చిందని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు విచారకరమని పేర్కొన్నారు. ఈ తీర్పు వల్ల దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగే అవకాశం ఉందని, విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన చేశారు. ఈ తీర్పులో బౌద్ధమతం, సిక్కు మతం తీసుకున్న వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. సిక్కు మతం , బౌద్ధమతం తీసుకుని వారికి వర్తించినట్లే క్రైస్తవ మతం తీసుకున్న వారికి కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రపతిని సైతం గుడిలోకి రాకుండా అడ్డుకొని అవమానించారని, దళిత క్రైస్తవులకు అట్రాసిటీ కేసులు వర్తించకపోతే మరింత వివక్షత ఎక్కువవుతుందని అన్నారు. 1950 లో సిక్కు మతం తీసుకున్న దళితులకు ఎస్సీ హోదా కల్పించారని, 1990లో బౌద్ధమతం తీసుకున్న దళితులకు ఎస్సీ హోదా కల్పించినట్లు వివరించారు. బౌద్ధులకు, సిక్కులకు ఎస్సీ హోదా కల్పించినట్లే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విధంగా పార్లమెంటులో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. 2005 లో బెహన్ మాయావతి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని బహిరంగ సభలో డిమాండ్ చేసినట్లు తెలిపారు.మాజీ ప్రధాని ప్రధాని మన్మోహన్ సింగ్ కు రెండుసార్లు లేఖ రాశారని అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే బిల్లు పార్లమెంట్లో ప్రవేశపడితే తాము మద్దతుగా ఓటు వేస్తామని ప్రతిపాదించారని వివరించారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రధాని మోడీ మత రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం పర్యటించిన ఆ రాష్ట్ర మతాలను బట్టి వ్యవహరిస్తున్నారని అన్నారు. మతాలను విడగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుప్రీంకోర్టు తీర్పుపై వ్యాఖ్యలు చేయకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అన్ని రిజర్వేషన్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆడియో రికార్డింగ్ వైరల్ అవుతున్నాయని వాటిని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని అన్నారు. దళితులను కించపరుస్తూ మాజీ ఎమ్మెల్సీ మాట్లాడిన మాటలు ఏ రాజకీయ పార్టీ ఖండించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు క్రైస్తవులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో గుడి కడతాం ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దౌర్జన్యం చేశాడని అన్నారు. అలాగే గన్నవరం నియోజవర్గం కుందనపల్లి గ్రామంలో దళిత వర్గానికి చెందిన మృతదేహాన్ని ఖననం చేసేందుకు తీసుకు వెళుతుంటే అగ్రవర్ణాల వారు అడ్డుకున్నారని అన్నారు. అలాగే రాజమండ్రిలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు దళితులను కించపరుస్తూ మాట్లాడాలని అన్నారు. రాష్ట్రంలో ఒక దళిత వర్గాన్ని టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఎస్.పి నాయకులు బయ్యే మునీంద్ర, పల్లేటి అబ్బులు, కొండపల్లి సూరిబాబు, కొత్తపల్లి శేఖర్,సాకిరి ధర్మరాజు,కొంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొడ్డును మర్యాదపూర్వక కలిసిన నరసన్న భూముల రైతులు



**– బొడ్డుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు**

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి చెందిన 256 ఎకరాలు ఇటీవల 22 (ఏ) నుండి ఎన్డీఏ ప్రభుత్వం విముక్తి చేసిన విషయం పాఠకులకు విధితమే. గురువారం నరసన్న ఆలయ భూముల రైతులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరిని బూరుగుపూడి గేటు వద్దన్నా తెదేపా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. నరసన్న భూములకు సంబంధించి త్వరలోనే మిగిలిన రైతులకు విముక్తి కల్పించి, బాధితులను అన్ని విధాలుగా ఎన్డీఏ ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. ఈ భూములకు సంబంధించిన రైతులు బతుకులు దశాబ్ద కాలంగా విచ్ఛిన్నంగా ఉన్నాయని, వారికి ధైర్యం కల్పించి ఒడ్డుకు చేర్చవలసిన బాధ్యత ఎంపీ పురందేశ్వరి, శాసనసభ్యులు బలరామకృష్ణ, మీతోనే సాధ్యపడుతుందని రైతులు ఆవేదన వెళ్ళబుచ్చారు. ఈ కార్యక్రమంలో కరుటూరి మోహన్, రొంగల శ్రీనివాస్, మాతా సీతారాముడు, కోర్పు రామకృష్ణ, ఉప్పలపాటి అబ్బు, కోడినాగుల ప్రసాద్, మాత ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ భద్రత కోసం భీమా పాలసీలను తీసుకోవాలి

### వాడ వాడకు జీవిత బీమాను తీసుకెళుతున్నాం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడవాడకు జీవిత బీమాను తీసుకెళ్తున్నామని, (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) ఎల్ఐసి యొక్క ఉపయోగం అవసరం తెలియజేస్తున్నామని ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ తెలిపారు. గురువారం రాజమండ్రిలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఐసి యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ భద్రతను తాను తీసుకోవడమే బాధ్యతగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎల్ఐసి సంస్థ పాలసీదారులకు ఉపయోగపడటమే కాకుండా సామాజిక బాధ్యతగా సుమారు లక్షల కోట్లు సంపదను దేశంలోని నీటి అవసరాలు, రోడ్ల నిర్మాణాలకు, వివిధ ప్రాజెక్టులకు ఖర్చు చేస్తుందని మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శర్మ, రాజమండ్రి ఎల్ఐసి మెయిన్ బ్రాంచ్ మేనేజర్ సాగర్, రూరల్ బ్రాంచ్ ఏబీఎన్ అబ్రహం చక్రవర్తి, పాలసీదారులు తదితరులు పాల్గొన్నారు.

# చీరపై గోరింటాకుతో రామాయణం

### శ్రీ సత్య డ్రాయింగ్ అకాడమీ ఇద్దరు బాలికల నైపుణ్యం



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** చీరపై గోరింటాకు ఉపయోగించి రామాయణంలోని ముఖ్య ఘట్టాలను చిత్రీకరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ఇద్దరు బాలికలు దీనిని రూపొందించారు. మండపేటలోని శ్రీ సత్య డ్రాయింగ్ అకాడమీకు చెందిన విద్యార్థినిలు వంకల శివలీల, రామిశెట్టి మౌనిక చీరపై ఎలాంటి కెమికల్స్ లేకుండా గోరింటాకు తో రామాయణ కావ్య దివ్య దృశ్యాలు రూపొందించారు. విభిన్నమైన ప్రాజెక్ట్ తయారు చేశారు. ఎటువంటి కలర్స్ ఉపయోగించకుండా కేవలం గోరింటాకుతో చీరపై రామాయణం గొప్ప తనాన్ని వివరిస్తూ రామాయణంలో ముఖ్య ఘట్టాలను చిత్రాలేఖనం రూపంలో రూపొందించారు. పర్యావరణానికి హాని చేయకుండా దీన్ని ఎన్నుకున్నారన్నారు. ఈ ప్రాజెక్ట్ వారి గురువు మందపల్లి సత్యానందం ఆధ్వర్యంలో రూపొందించారన్నారు.

### పాఠ్యపుస్తకాలు ముద్రణలో గోప్యత లేదు..

# లీకేజీపై కూటమి ప్రభుత్వం వైఫల్యం

### యుద్ధ ప్రాతిపదికన దోషుల మీద చర్యలు తీసుకోవాలి - పీడీఎస్యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశీలో 2026-2027 అకాడమిక్ సంవత్సరానికి ఇంటర్ మీడియట్ విద్యా కోర్సుకి సంబంధించి పాఠ్య పుస్తకాలు అందించే ప్రక్రియ కోసం కూటమి ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవడం లో పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వ అనుమతితో అధికారికంగా ముద్రణ జరగవలసివుంది కానీ దొంగే దొంగ అన్న చందంగా కమిషన్లకి కక్కుర్తి పడి తమకు అనుకూలంగా ఉన్న పబ్లిషర్స్ తో టెండర్స్ వేయిపించి సాఫ్ట్ కాపీ లు బయటకు వచ్చాయి. దీని వెనుక జరిగిన అవినీతి అక్రమాలు మీద పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని, తప్పుకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్యూ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తుంది. పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 2026-2027 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రారంభం లోనే ఆటలాడుతున్నారు . పుస్తకాలు ముద్రణ చేసే ప్రక్రియలో నిబంధనలు పాటించకుండా అధికారదుర్వినియోగనికి పాల్పడుతూ తెలుగు అకాడమీ చైర్మన్, ఇతర అధికారులు కలిసి పబ్లిషర్స్ తో చేతులు కలిపి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని సాఫ్ట్ కాపీ లను బయటకు రావడం వంటివి జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. 2021-2022 సంవత్సరం లో ఇలాంటివి జరిగినప్పుడు కొంతమంది పబ్లిషర్స్ని (ఎస్సీఆర్టీ సంస్థ)బ్లాక్ లిస్ట్లో పెట్టి అదే సంస్థ టెండర్స్ పేర్లు మార్చి తిరిగి టెండర్స్కి అవకాశాన్ని కల్పించడం దారుణమైన విషయం అని, విద్యా వ్యవస్థలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జరుగుతున్న పరిణామాలు చూసి నోరుమెదపకపోవడం విచారకరం అన్నారు. వీజేఎస్, విక్రమ్ తదితర పబ్లిషర్స్ కి కేటాయింపులు చేసినటువంటి టెండర్స్ని రద్దు చెయ్యాలి. అలాగే అవినీతికి పాల్పడిన వారిమీద కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్యూ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తుంది.

# త్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో రవితేజకు బంగారు పతకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బొక్కరాంబాబు తనయుడు బొక్కరవితేజ చిన్ననాటి నుంచి త్రోబాల్ మీద ఆసక్తి వలన తన ప్రతిభను కనబరుచు కున్నాడు.ఇటీవల జరిగిన 34 ఫెడరేషన్ కప్ త్రో బాల్ ఛాంపియన్షిప్ ఆలిండియా నేషనల్ లెవెల్ నందు మొదటి బహుమతి బంగారు పతకం, 17 సౌత్ జోన్ సీనియర్ నేషనల్ త్రో బాల్ ఛాంపియన్షిప్ లెవెల్లో ద్వితీయ బహుమతిగా వెండి పతకం సాధించాడు. గతంలో జరిగిన 47 సీనియర్ నేషనల్ త్రోబల్ చాంపియన్షిప్ లో ఆడగా ఇండియన్ టీంకి సెలెక్ట్ అయ్యి జూన్ నెలలో మలేషియాలో జరగబోయే ఇంటర్నేషనల్ కూడా సెలెక్ట్ అయ్యి ఆడబోతున్నందుకు ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లిమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ మేడం డాక్టర్ నల్లిమిల్లి సుగుణ రెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆదిత్య స్కూల్ ఆఫ్ యానిమేషన్ ప్రిన్సిపల్ ఎం. చంద్రశేఖర్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలియ జేశారు.రవితేజ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అవరోదించాలని విద్యార్థిని ప్రోత్సహించారు.

### కల్తీ పాల ఘటన..

# సుమోటోగా తీసుకున్న ఎన్హెచ్ఆర్సీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైన రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుంది. ఈ మేరకు ఏపీ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. గత నెల జరిగిన ఈ ఘటనలో ఇప్పటి వరకు 17 మంది మృతి చెందగా, పలువురు చికిత్స పొందుతున్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# రామ్ చరణ్ కంటికి సర్జరీ..

## స్పందించిన మెగాస్టార్ చిరంజీవి..



పెద్ది సినిమా చిత్రీకరణ సమయంలో జరిగిన ప్రమాదంలో రామ్ చరణ్ స్వల్పంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇదివరకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్పందిస్తూ చరణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చరణ్ ఎడమ కంటికి స్వల్ప గాయమైందని.. చిన్న చికిత్స అనంతరం ఆయన కోలుకున్నారంటూ చిత్రయూనిట్ తెలిపింది. తాజాగా చరణ్ గాయం విషయంపై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటేస్ట్ మూవీ పెద్ది. ఈ సినిమా షూటింగ్ కొన్ని నెలలుగా వేగంగా జరుగుతుంది. ఈ క్రమంలోనే చిత్రీకరణ సమయంలో జరిగిన చిన్న ప్రమాదంలో చరణ్ స్వల్పంగా గాయపడిన సంగతి తెలిసిందే. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా.. ఆయన ఎడమ కంటికి చిన్న దెబ్బ తగిలింది. దీంతో షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇప్పటికే చరణ్ గాయం పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. చరణ్ త్వరగా కోలుకోవాలని ట్వీట్ చేశారు. దీంతో చరణ్‌కు ఎంత పెద్ద తగిలిందో అంటూ అభిమ్నులు కంగారు పడ్డారు. అటు సోషల్ మీడియాలో చరణ్ హెల్త్ అప్డేట్ కోసం ఫ్యాన్స్ తెగ ఎదురుచూశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా చరణ్ గాయంపై హెల్త్ అప్డేట్ ఇచ్చింది చిత్రయూనిట్. రామ్ చరణ్ ఎడమ కంటికి స్వల్ప గాయమైందని.. తగిన చికిత్స తీసుకున్నాక ఆయన కోలుకున్నారని.. క్షేమంగా ఉన్నారని పెద్ది చిత్రయూనిట్ తెలిపింది. ముందుగా ప్లాన్ చేసిన విధంగానే గురువారం (మార్చి 26) నుంచి చరణ్ మళ్లీ షూటింగ్ లో పాల్గొంటారని వెల్లడించింది. చరణ్ ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రామ్ చరణ్ గాయం గురించి వస్తున్న రూమర్లను నమ్మొద్దని మెగా అభిమానులకు విజ్ఞప్తి చేశారు పెద్ది మూవీ మేకర్స్. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదిలా ఉంటే.. రామ్ చరణ్ హెల్త్ గురించి మెగాస్టార్ చిరంజీవి సైతం సోషల్ మీడియా ద్వారా స్పందించారు. చరణ్ కు సర్జరీ చేసిన డాక్టర్ సుధాకర్ ప్రసాద్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "చరణ్ కనురెప్పకు మీరు సకాలంలో, నైపుణ్యంతో చేసిన శస్త్రచికిత్స నిజంగా మాకు ఒక వరంలాంటిది. మాకు ఆందోళన కలిగించిన ఆ క్షణం, మీ కచ్చితత్వం, శ్రద్ధ, నైపుణ్యంతో మీరు చెప్పిన ఆ మాటలతో మా భయం పూర్తిగా తొలగిపోయింది. మీ పనితనమే అన్నింటికీ కారణం, అందుకు మేము నిజంగా కృతజ్ఞతలు" అంటూ ట్వీట్ చేశారు. చిరు ట్వీట్ పై మెగా ఫ్యాన్స్ రియాక్ట్ అవుతూ చరణ్ త్వరగా కోలుకోవాలని కామెంట్స్ చేస్తున్నారు.

## ఆ షో వల్ల నా కెరీర్

# నాశనం అయ్యింది..

### నా గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడుకున్నారు

కొంతమంది ముద్దుగుమ్మలు సినిమాలతో పాటు టీవీ షోల్లోనూ పాల్గొంటూ ఆడియన్స్ ను ఆకట్టుకుంటున్నారు. చాలా మంది భామలు సినిమాలు తగ్గించి టీవీ షోలతో గేమ్ షోలతో బిజీ అవుతున్నారు. వారిలో ఈ అమ్మడు ఒకరు. కానీ ఓ గేమ్ షో వల్ల తన కెరీర్ నాశనము అయ్యిందని చెప్పి షాక్ ఇచ్చింది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలు పెట్టిన చాలా మంది ఇప్పుడు సినిమాల్లో హీరోలుగా, హీరోయిన్స్‌గా సినిమాలు చేసి ఆడియన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు మాత్రం హీరోయిన్స్‌గా సక్సెస్ అవ్వలేక సతమతం అవుతున్నారు. వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. చేసింది కొన్ని సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన నటనతో అందంతో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడి గ్లామరస్ ఫోటోలకు ఓ రేంజ్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. కుర్రకారు ఈ చిన్నది ఎప్పుడెప్పుడు ఫోటోలు షేర్ చేస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అయితే ఓ గేమ్ షో వల్ల తన కెరీర్ నాశనం అయ్యిందని. తనకు ఉన్న క్రేజ్ కూడా పోయిందని ఆమె చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో ఫెమస్ అయ్యింది తేజస్వి మాదివాడ. ఆతర్వాత నితిన్ హీరోగా నటించిన హార్ట్ ఎటాక్ సినిమాలోనూ నటించింది. ఆర్జీవీ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్ గా నటించినా, ఆ తర్వాత సెకెండ్ ఫీమెల్ లీడ్, క్యారెక్టర్ ఆర్టిస్టుగానే ఎక్కువగా కనిపించింది.బిగ్ బాస్ హౌజ్ లో అడుగు పెట్టి బుల్లితెర ఆడియెన్స్‌కు చేరువైన తేజస్వి మదివాడ. బిగ్ బాస్ తెలుగు సీజన్ 2 లో పాల్గొంది ఈ అమ్మడు. తన ఆటతో ప్రేక్షకులను అలరించింది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ అమ్మడు సినిమాల్లో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు.. కానీ అలా జరగలేదు. ప్రస్తుతం ఈ అమ్మడు కూడా సోషల్ మీడియాలో ఫోటోలు, రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో తేజస్వి మాట్లాడుతూ షాకింగ్ కామెంట్స్ చేసింది. చాలా మంది బిగ్ బాస్ లోకి వెళ్లాలని ఆరాటపడుతున్నారు.. అక్కడ జరిగేది ఒకటి మనకు చూపించేది మరొకటి. బిగ్ బాస్ చూసిన జనాలు మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకుంటారు. మా గురించి పిచ్చుపిచ్చిగా మాట్లాడుకుంటుంటారు.. చాలా మంది నెగిటివ్ కామెంట్స్ చేస్తారు. దాంతో దర్శకనిర్మాతలు మాకు ఛాన్స్ లు ఇవ్వడానికి వెనకడుతారు. బిగ్ బాస్ గేమ్ షోలో పాల్గొనడం వల్లే నా కెరీర్ నాశనం అయ్యింది అని తెలిపింది తేజస్వి. ఇక బిగ్ బాస్ లోకి వెళ్లే గురించి మాట్లాడుతూ.. బిగ్ బాస్ హౌస్ లోకి వెళ్తే ఫెమస్ అవ్వడమేమో కానీ ఉన్న ఫేమ్ పోతుంది అని తేజస్వి చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



క్రీడా వాయిస్

### బీసీసీఐ కీలక నిర్ణయం..

# ఐపీఎల్ 2026 ఓపెనింగ్ సెర్మనీ రద్దు..



గతేడాది జరిగిన విషాదం నేపథ్యంలో ఐపీఎల్ 2026 ఓపెనింగ్ సెర్మనీని బీసీసీఐ రద్దు చేసింది. మార్చి 28న ఆర్‌సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. మే 31న జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కాబోతోంది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి పోరు జరగనుంది. అయితే, ప్రతి ఏటా అట్టహాసంగా జరిగే ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీని ఈసారి రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆడంబరాలు, ఆర్భాటాలకు దూరంగా ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ ప్రారంభోత్సవాన్ని రద్దు చేయడానికి గల కారణాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజీత్ సైకియా వెల్లడించారు. గతేడాది జూన్ 4న ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల సమయంలో చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ మృతుల పట్ల గౌరవం, వారి కుటుంబాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూ.. ఎటువంటి వినోద కార్యక్రమాలు లేకుండా లీగ్‌ను ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది. కేవలం ఆటపైనే దృష్టి సారించి, బాధితుల జ్ఞాపకార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియాతో మాట్లాడుతూ ఆయన ధృవీకరించారు. ప్రారంభోత్సవం లేకపోయినా, మే 31న జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతానికి కేవలం మొదటి 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించిన బోర్డు, త్వరలోనే పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. గతేడాది షారుఖ్ ఖాన్, శ్రేయా ఘోషల్, దిశా పటాని వంటి తారలతో అట్టహాసంగా వేడుకలు జరిగాయి. కానీ ఈసారి ఆ కళ తప్పనుంది. అయితే ఫైనల్ రోజున మాత్రం అంతకు మించి సెలబ్రేషన్స్ ఉంటాయని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. శనివారం సాయంత్రం 7:30 గంటలకు ప్రారంభం కానున్న ఆర్‌సీబీ - ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మ్యాచ్ సమయంలో 10 నుండి 15 శాతం వర్షం కురిసే అవకాశం ఉంది. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి తొలిసారి ఐపీఎల్ కప్పు గెలిచిన ఆర్‌సీబీ, ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతోంది. సొంత గడ్డపై తమ పట్టు నిలుపుకోవాలని కోహ్లీ సేన భావిస్తుంటే, ప్యాట్ కమిన్స్ లేని లోటులో ఇషాన్ కిషన్ నాయకత్వంలోని హైదరాబాద్ ఎలా రాణిస్తుందో చూడాలి.

# ఐపీఎల్ 2026 ముంగిట ధోనీ మాస్టర్ క్లాస్..



ఐపీఎల్ 2026 కోసం ధోనీ వికెట్ కీపింగ్ స్కూల్ ప్రారంభమైంది. సీఎస్‌కే యువ కీపర్లు కార్తీక్ శర్మ, ఉర్విల్ పటేల్‌లకు థలా నెట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తూ మెళకువలు నేర్పిస్తున్నారు. సీఎస్‌కే తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయడంతో అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. ఐపీఎల్ 2026 సందడి మొదలైందో లేదో, అప్పుడే మన థలా ఎంఎస్ ధోనీ తనదైన శైలిలో రంగంలోకి దిగారు. బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించడం ఒక ఎత్తయితే, వికెట్ల వెనుక ధోనీ చేసే మ్యాజిక్ మరో ఎత్తు. క్రికెట్ పుస్తకాల్లో కూడా లేని విన్యాసాలను వికెట్ కీపింగ్‌లో చూపెట్టే ధోనీ, ఇప్పుడు యువ ఆటగాళ్లకు గురువుగా మారారు. చెన్నై సూపర్ కింగ్స్ క్యాంప్‌లో ధోనీ వికెట్ కీపింగ్ స్కూల్ మొదలైంది. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన వీడియోను సీఎస్‌కే తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేయడంతో అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. చెన్నై సూపర్ కింగ్స్ షేర్ చేసిన వీడియోలో ధోనీ తన జట్టులోని ఇద్దరు యువ వికెట్ కీపర్లకు ట్రైనింగ్ ఇస్తూ కనిపించారు. వారే కార్తీక్ శర్మ, ఉర్విల్ పటేల్. వీరిద్దరూ మైదానంలో విధ్వంసకర బ్యాటింగ్‌కు పేరుగాంచినప్పటికీ, ధోనీ పాఠశాలలో మాత్రం వికెట్ కీపింగ్‌లో మెళకువలు నేర్చుకుంటూ కనిపించారు. ధోనీ ప్రతి మాటను వారు ఎంతో ఏకాగ్రతతో వింటున్నారు. మ్యాచ్ సమయంలో క్లిష్ట పరిస్థితుల్లో వికెట్ల వెనుక ఎలా చురుగ్గా ఉండాలి, బ్యాటర్ కదలికలను బట్టి ఎలా స్పందించాలి అనే విషయాలపై ధోనీ వారికి దిశా నిర్దేశం చేస్తున్నారు. సాధారణంగా ప్రతి ఐపీఎల్ సీజన్‌లో మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు ధోనీ చుట్టూ చేరి సలహాలు తీసుకోవడం మనం చూస్తూనే ఉంటాం. కానీ ఈసారి సీజన్ మొదలవ్వకముందే తన సొంత జట్టు ఆటగాళ్లను ధోనీ తీర్చిదిద్దుతున్నారు. ఉర్విల్, కార్తీక్ ఇద్దరూ క్రీజులో భారీ షాట్లు కొట్టడానికి ఇష్టపడతారు, కానీ ధోనీ మాత్రం వారి కీపింగ్ నైపుణ్యాలను సానబెడుతున్నారు. ధోనీ దగ్గర శిక్షణ పొందిన ఈ యువ ఆటగాళ్లు ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం వస్తే వికెట్ల వెనుక ధోనీ స్థాయి ప్రదర్శన చేయడానికి సిద్ధమవుతున్నారు. వికెట్ కీపర్‌గా ఐపీఎల్‌లో ధోనీకి సాటి ఎవరూ లేరు. ఈ లీగ్‌లో 200 కంటే ఎక్కువ వికెట్లు (క్యాచ్‌లు + స్టంపింగ్‌లు) తీసిన ఏకైక కీపర్‌గా ధోనీ చరిత్ర సృష్టించారు. చెన్నై సూపర్ కింగ్స్ మరియు గతంలో రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్ తరపున ఆడుతూ ఆయన ఈ ఘనత సాధించారు. ఆయన స్టంపింగ్ వేగం మెరుపు కంటే వేగంగా ఉంటుందని క్రికెట్ దిగ్గజాలే చెబుతుంటారు. ఇప్పుడు అదే వేగాన్ని, నైపుణ్యాన్ని తన తర్వాతి తరం ఆటగాళ్లకు ధోనీ వారసత్వంగా అందిస్తున్నారు. ప్రస్తుతానికి కార్తీక్, ఉర్విల్ మాత్రమే ధోనీ దగ్గర ట్రైనింగ్ పొందుతున్నట్లు కనిపిస్తున్నా, టోర్నమెంట్ సాగుతున్న కొద్దీ ఇతర జట్ల కీపర్లు కూడా ధోనీ పాఠశాలలో చేరడం ఖాయం. ప్రతి ఏటా ధోనీ ఇచ్చే టిప్స్ యువ క్రికెటర్ల కెరీర్‌ను మార్చేస్తుంటాయి. ఐపీఎల్ 2026లో ధోనీ కేవలం ఆటగాడిగానే కాకుండా ఒక మెంటార్‌గా, గైడ్‌గా తన ముద్ర వేయబోతున్నారు. సీఎస్‌కే ఫ్యాన్స్ కూడా తమ అభిమాన ఆటగాడిని ఇలా కోచ్ అవతారంలో చూడటం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com